





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 285 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 21 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 285 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SAT 21 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## భారత్ దెబ్బకు విలవిల... ఒప్పుకున్న పాకిస్థాన్ ఉప ప్రధాని



- భారత దాడుల వల్లే కాల్పుల విరమణ కోరామన్న పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్
- రావల్పిండి, పంజాబ్‌లోని రెండు పాక్ వాయుసేన స్థావరాలపై భారత్ దాడులు
- సౌదీ అరేబియా, అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు పాక్ అభ్యర్థన

పెన్ పవర్ డెస్క్:గత నెలలో భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడానికి తామే చొరవ చూపాల్సి వచ్చిందని పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా

వివరాలు 11లో..

## 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్... వందలమంది మృతి



- ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ భారీ వైమానిక దాడులు
- అణు కార్యక్రమంతో సంబంధమున్న ఎస్పీఎన్‌డీ సంస్థ ప్రధాన లక్ష్యం
- 60కి పైగా యుద్ధ విమానాలతో క్షిపణి తయారీ కేంద్రాలపై బాంబుల వర్షం
- టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయం ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటన
- ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో 639 మంది మృతి చెందినట్లు సమాచారం

పెన్ పవర్ డెస్క్:ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం రాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడింది. 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లోని లక్ష్యాలపై నిప్పులు చెరిగింది. ముఖ్యంగా, ఇరాన్ అణు కార్యక్రమంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఫెన్సివ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ (ఎస్పీఎన్‌డీ) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో దాదాపు 639 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం.

వివరాలు 11లో..

# ఆంగ్ల భాషపై అమిత్ షా వ్యాఖ్యలు.. స్పందించిన రాహుల్ గాంధీ

- ఆంగ్ల భాష నేర్చుకోవడం అవమానకరం కాదన్న రాహుల్ గాంధీ
- ప్రపంచంతో పోటీ పడాలంటే ఆంగ్లం తప్పనిసరి అని స్పష్టీకరణ
- విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని వెల్లడి
- పేద విద్యార్థుల ఉన్నతి బీజేపీ, ఆర్ఎస్ఎస్ లకు ఇష్టం లేదని విమర్శ
- మాతృభాషలతో పాటు ఆంగ్ల విద్య అవసరమని సూచన

వివరాలు 11లో..



## జగన్ పర్యటన సందర్భంగా మృతి చెందిన సింగయ్య కుటుంబానికి రూ. 10 లక్షల చెక్ అందించిన అంబటి

- సింగయ్య కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నేతలు అంబటి, మోదుగుల
- సింగయ్య మృతిని కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోందన్న అంబటి
- కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని పార్టీ నేతల హామీ




పెన్ పవర్ డెస్క్:పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆ పార్టీ కార్యకర్త మృతిచెందడం విషాదాన్ని నింపింది. వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సింగయ్య అనే కార్యకర్త ఈ ప్రమాదంలో మరణించారు. ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో, వైసీపీ సీనియర్ నేతలు సింగయ్య కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వివరాలు 11లో..

# యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం

- నేడు11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, రాష్ట్రవ్యాప్త వేడుకలకు పిలుపు
- విశాఖ ఆర్కే బీచ్‌లో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు హాజరు
- యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి దూరమవుతుందన్న చంద్రబాబు
- వాడవాడలా యోగా సాధనతో చరిత్ర సృష్టిద్దామని పిలుపు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నేడు (జూన్ 21) జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా యోగా సాధనలో సరికొత్త రికార్డు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు.

**యోగా - మన సంస్కృతి, మన ఆరోగ్యం**

యోగా మన ప్రాచీన సంస్కృతిలో భాగమని, అది మనకు లభించిన అమూల్యమైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శారీరక, మానసిక ఒత్తిళ్లను తగ్గించడంలో

వివరాలు 11లో..



## అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే... అది మర్చిపోవద్దు

- అప్రజాస్వామికంగా మాట్లాడే వారిని ప్రజలు గమనించాలని పవన్ సూచన
- మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందన
- సినిమా డైలాగులు నిజ జీవితంలో కుదరవని హితవు
- అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- రౌడీ షీట్లు తెరిచి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అణచివేస్తామన్న పవన్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించేవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కల్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన

వివరాలు 11లో..

# చంద్రబాబు తలచుకుంటే జగన్ రెండు నిమిషాల్లో జైల్లో ఉంటారు

- టీడీపీ ప్రభుత్వానికి కక్ష సాధింపు ఉద్దేశం లేదన్న మంత్రి లోకేశ్
- సాక్ష్యాలుంటే జగన్‌తో సహా ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టీకరణ
- మద్యం, వివేకా హత్య కేసుల్లో జగన్ ప్రమాణం చేస్తారా అని సవాల్
- ప్రధాని మోదీతో భేటీపై తొలిసారి పెదవి విప్పిన మంత్రి నారా లోకేశ్
- సూపర్ సిక్స్ హామీల అమలు, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యం



పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. మద్యం కుంభకోణంలో జగన్‌కు ఒక్క పైసా కూడా ముట్టలేదని దేవుడిపై ప్రమాణం చేయగలరా అని బహిరంగ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవని చెబుతూనే, గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**జగన్‌కు లోకేశ్ సూటి సవాల్**

మద్యం కుంభకోణంపై జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మద్యం వ్యాపారంలో ఒక్క పైసా కూడా తినలేదని జగన్ దేవుడి మీద ప్రమాణం చేయాలి. ఇదే నా సవాల్. గతంలో వివేకా హత్య కేసులో మా కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని నేను ప్రమాణం చేస్తానని, మీరు కూడా రావాలని అలిపిరిలో సవాలు విసిరితే జగన్ పారిపోయారు" అని గుర్తుచేశారు. చంద్రబాబు నిజంగా కక్ష సాధించాలనుకుంటే రెండు నిమిషాలు పట్టదని, కానీ తాము విధానాల ప్రకారమే వెళ్తామని, ప్రజలు

వివరాలు 11లో..

## ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజు ఎంతో దూరం లేదు

- అమిత్ షా సంచలన వ్యాఖ్యలు
- ఆంగ్లం వలసవాద బానిసత్వానికి చిహ్నమన్న అమిత్ షా
- కొన్నాళ్లకు ప్రజలే ఆంగ్లాన్ని తిరస్కరిస్తారని జోస్యం
- స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతి, వారసత్వాలకు గుర్తింపు అని వ్యాఖ్య




వివరాలు 11లో..

## విశాఖలో గవర్నర్‌తో మంత్రి లోకేశ్ భేటీ... 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

- ప్రపంచ యోగా దినోత్సవం కోసం విశాఖకు గవర్నర్ అబ్దుల్ నజీర్
- గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి నారా లోకేశ్
- పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి 'యువగళం' పుస్తకం అందజేత
- నేడు విశాఖలో 5 లక్షల మందితో 'యోగాంధ్ర' కార్యక్రమం
- ప్రపంచ రికార్డు లక్ష్యంగా ఏపీ ప్రభుత్వ భారీ ఏర్పాట్లు
- 'యోగాంధ్ర'కు హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ

వివరాలు 11లో..



## 'యోగాంధ్ర'తో ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది... కూటమి నేతలను అభినందించిన మోదీ

- (జూన్ 21) విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం
- విశాఖ చేరుకున్న ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికిన చంద్రబాబు, పవన్, లోకేశ్
- ఏపీ నేతల సమష్టి కృషి ప్రశంసనీయమన్న ప్రధాని మోదీ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' కార్యక్రమం ఏర్పాట్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖ ఎంపీ భరత్‌లతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని, దీని ద్వారా ప్రపంచం ఏపీ వైపు చూసేలా చేశారని

వివరాలు 11లో..



## ఎడిటర్ వ్యూ

# ఏపీలో రప్పా రప్పారాజకీయం..
## సిల్వర్ స్క్రీన్ పై నుంచి పొలిటికల్ డైలాగుల్లా మారి?

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం రాజకీయాలు ప్రతి రోజూ హీటెక్కుతున్నాయి. ఎన్నికలయి ఏడాది పూర్తి కాక ముందే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలయింది. 2019లో టీడీపీ పార్టీ ఓడిపోయినప్పుడు కూడా ఇంతే.ఏడాదిలోనే అప్పుడు కూడా రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల వరకూ కొనసాగాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి పల్నాడు జిల్లా పర్యటనతో మరింత హీటెక్కాయి. రప్పా రప్పా రాజకీయాలు నడుస్తున్నాయి. పుష్ప సినిమాలో డైలాగులు నేరుగా పొలిటికల్ స్క్రీన్ పై ప్రత్యక్ష్యమవుతున్నాయి. మాటల యుద్ధం మొదలయింది. ఇద్దరు ఎవరికి వారు తగ్గేదిలేదు అన్నట్లుగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా యువతను ఆకట్టుకునేందుకు ఇలాంటి నినాదాలతో నేతలు ముందుకు వెళుతున్నారా? అన్నఅనుమానం అందిరిలోనూ కలుగుతుంది.

**సోషల్ మీడియావార్...**

జగన్ పల్నాడు జిల్లాలో పర్యటనలో ఇద్దరు మరణించారని, వారి మృతి జగన్ కారణమని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు కందుకూరులో,గుంటూరులో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో అమాయకులు మరణించిన విషయాన్ని వైసీపీ నేతలు తమ సోషల్ మీడియా పోస్టుల ద్వారా గుర్తు చేస్తున్నారు. నాడు ఇరుకు సందుల్లో పెట్టి జనం వచ్చారని నమ్మించే ప్రయత్నం చేయబట్టే కందుకూరులో అంత మంది మరణించడానికి కారణమని నాడు అధికారంలో ఉన్న వైసీపీ చెప్పి రాష్ట్రమంతటా సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తే, నేడు జగన్ పర్యటనపై ఆంక్షలు విధిస్తూ మూడు వాహనాలకు, వందమందికిమించి వెళ్లడానికి వీలు లేదని చెబుతోంది.

**అధికారంలో ఎవరున్నా...**

నాడు జగన్ అయినా నేడు చంద్రబాబు అయినా ఒకటే లక్ష్యం. సభలకు, సమావేశాలకు, పర్యటనలకు ఎక్కువ మంది జనం వచ్చినట్లు కనపడితే అది సామాన్య ప్రజలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన కట్టడి చేయడానికి కారణమంటున్నారు. ప్రధానంగా ప్రధాన మీడియా మరుగున పడిపోయి సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిన నేటి కాలంలో పర్యటనలకు హైప్ రావడం ఇష్టం లేకనే ఇలాంటి అనవసర ఆంక్షలు పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నాడు జగన్ ఏపీలో రాజకీయ సభలు, సమావేశాలకు ఏకంగా ఒక జీవోను విడుదల చేశారు. దానిపై అప్పట్లో చంద్రబాబు న్యాయపోరాటం చేశారు.నేడు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అదేరకమైన ఆంక్షలు విధిస్తుండటంతో ఏపీ పాలిటిక్స్ నిజంగానే రప్పా రప్పాగానే నడుస్తున్నాయంటున్నారు. ఇద్దరిలో ఎవరూ సుద్దపూసలు కాదు. పుణ్యాత్ములు కాదన్నది సామాన్యుల మాటగా వినిపిస్తుంది.

**తప్పు కాదన్న జగన్.. తప్పేనన్న బాబు...**

ఇక వైసీపీ అధికారంలోకి రాగానే జాతరలో పొట్టేళ్లను నరికినట్లు రప్పారప్పా నరికేస్తామంటూ జగన్ పల్నాడు పర్యటనలో ఫ్లెక్సీలు వెలిశాయి.అయితే ఆ ఫ్లెక్సీపట్టుకుంది గతంలో టీడీపీ కార్యకర్త అని వైసీపీనేతలు చెబుతున్నారు. అసలు రప్పా రప్పా అంటూ పుష్పసినిమాడైలాగు చెబితే తప్పేంటి.. అడ్డంగా తల అటు ఇటూ ఊపినా కేసులు పెట్టడం కామన్ అయిందని వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యానించారు. ఇదేమి రాజకీయం అంటూ ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌంటర్ ఇస్తూ నాయకులకు హుందాతనం ఉండాలని, ఒకవైపు యోగా డే వేడుకలు జరుగుతుంటే మరికొందరు రప్పా రప్పా అంటున్నారన్నానిఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఊళ్లలో గ్రామ దేవతలకు పొట్టేళ్లను బలి ఇచ్చేటప్పుడు రప్పా రప్పా అనేవారని, ఇష్టానుసారంగా టెర్రరిజం క్రియేట్ చేస్తే ఊరుకోబోమని చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో మొత్తం మీద ఏపీలో రప్పా రప్పారాజకీయం ఎటువైపు దారి తీస్తుందోచూడాలి.

# ఒక భూమి, ఒక ఆరోగ్యం : యోగాతోనే సాధ్యం




**నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం**

2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంగా, ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 31న "మనకి బాత్"లో ప్రకటించిన థీమ్ "ఒక భూమి, ఒక ఆరోగ్యం" వ్యక్తిగత ఆరోగ్యమే కాదు, పర్యావరణ ఆరోగ్యాన్ని కూడా సమంగా నిలబెడుతున్నదిగా నిలుస్తోంది. ఈ సందేశం మన ఆరోగ్యం, ప్రకృతితో గల అనుబంధాన్ని గుర్తు చేస్తోంది.

**భగవద్గీతలో శ్రీకృష్ణుని మాటలు:**

"అనన్యాశ్చింతయంతో మాం ఏ జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం" అర్ధం ఏమిటంటే, పరమాత్మను ఆశ్రయించినవారి యోగక్షేమాలను స్వయంగా తానే నిర్వహిస్తాడు. ఈ రెండు లక్ష్యాలైన యోగం మరియు క్షేమం కలిసినప్పుడే జీవితం సార్థకమవుతుంది. యోగం మనకు సాధనను, ఆత్మనిర్మాణాన్ని ఇస్తే, క్షేమం దానిని నిలబెట్టే శక్తిని ఇస్తుంది.

**నేటి కాలానికి అన్వయము:**

డిజిటల్ ప్రపంచంలో, మనిషి విభిన్నమైన అలవాట్లతో జీవన విధానాలను మరచిపోతున్నాడు. ఇలాంటి సమయంలో యోగక్షేమం పట్ల చైతన్యం కలిగి ఉండటం అత్యంత అవసరం. "యోగం" మనల్ని నిలబెట్టే "శక్తి" అయితే, "క్షేమం" మనకు ఆశ్రయం కలిగించే "రక్షణ కవచం".

**యోగా పితా మహుడు:**

యోగాకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ఋగ్వేదం, పౌరాణిక పుస్తకాలలో కూడా యోగా గురించి ప్రస్తావించబడింది. సింధు నాగరికత కాలం నాటికే యోగా ఆచరణలో ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. పతంజలి యోగాసనాలను ఒక చోట చేర్చి యోగాకు ఒక రూపునిచ్చాడు. అందుకే పతంజలిని "యోగా పితా మహుడి"గా అభివర్ణిస్తారు. కొద్దిపాటి మార్పులు చేర్పులతో పలు విధానాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. భారతీయ జీవన విధానంలో భాగమైన యోగా ఇప్పుడు ప్రపంచవ్యాప్తమైంది.

**ఐక్యరాజ్యసమితి:**

దాని సార్వత్రిక ఆకర్షణను గుర్తించి, 2014 డిసెంబర్ 11న, ఐక్యరాజ్యసమితి 69/131 తీర్మానం ద్వారా జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది .

అంతర్జాయ యోగా దినోత్సవాన్ని ఏర్పాటు చేసే ముసాయిదా తీర్మానాన్ని భారతదేశం ప్రతిపాదించింది మరియు రికార్డు స్థాయిలో 175 సభ్య దేశాలు ఆమోదించాయి. ఈ ప్రతిపాదనను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జనరల్ అసెంబ్లీ 69వ సెషన్ ప్రారంభోత్సవంలో తన ప్రసంగంలో ప్రవేశపెట్టారు, దీనిలో ఆయన ఇలా అన్నారు: "యోగా మన ప్రాచీన సంప్రదాయం నుండి వచ్చిన అమూల్యమైన బహుమతి. యోగా మనస్సు మరియు శరీరం, ఆలోచన మరియు చర్య యొక్క ఐక్యతను కలిగి ఉంటుంది. మన ఆరోగ్యానికి మరియు మన శ్రేయస్సుకు విలువైన సమగ్ర విధానం. యోగా కేవలం వ్యాయామం గురించి కాదుబీ ఇది మీతో, ప్రపంచంతో మరియు ప్రకృతితో ఏకత్వ భావాన్ని కనుగొనడానికి ఒక మార్గం."

**యోగసాధన:**

యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడం అంతర్జాతీయ యోగా దినోత్సవ లక్ష్యం.ఈ పది సంవత్సరాలలో యోగ ప్రపంచ వ్యాప్తంగా మార్పును తీసుకు వచ్చింది.ప్రపంచ వ్యాప్తంగా యోగ సాధనలో ఒక కొత్త ధోరణిని గమనించవచ్చు. యోగను సాధన చేసే ధోరణి యూరోప్ లోని పలు దేశా లలో శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుతం జర్మనీలో దాదాపు ఒకటిన్నర కోట్ల మంది యోగ సాధకులుగా మారిపోయారు.



**యోగ పై పరిశోధన:**

2015లో తుర్క్ మెనిస్తాన్ లో ఒక యోగ సాధన కేంద్రం ప్రారంభమైంది యోగ అక్కడ ఎంతగానో ప్రజాదరణకు నోచుకొన్నది. తుర్క్ మెనిస్తాన్లో ప్రభుత్వ వైద్య విశ్వవిద్యాలయంలో యోగ ప్రధానమైన చికిత్స పద్ధతిని చేర్చడమైంది. సౌదీ అరేబియా అయితే యోగను విద్య వ్యవస్థలోకి ప్రవేశపెట్టడమైంది. మంగోలియాలో మంగోలియన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక యోగ పాఠశాలలు నడుస్తున్నాయి. ప్రపంచం అంతటా ప్రధాన సంస్థలు, విశ్వవిద్యాలయాలు యోగ పై పరిశోధనలను నిర్వహించడంతో పాటు పరిశోధన పత్రాలను కూడా ప్రచురిస్తున్నాయి.

**అత్యంత గొప్పదైన శక్తి:**

యోగ ఒక్క క్రమశిక్షణయే కాకుండా అది ఒక విజ్ఞాన శాస్త్ర మనికూడా చెప్పాలి. ఒక అంశం పైన దృష్టిని కేంద్రీకరించడం అనేది మానవ మస్తిష్కానికి ఒక పెద్ద సవాలుగా నిలుస్తోంది. దీనికి సైతం ఒక సమాధానాన్ని యోగ అందిస్తుంది. మానవ మేధకు ఉన్న అత్యంత గొప్పదైన శక్తి ఏకాగ్రత అని మనకు తెలుసు. ఈ సామర్థ్యాన్ని కూడా యోగ ద్వారాను, ధ్యానం ద్వారాను పెంపొందింప చేసుకోవచ్చు. ఈ కారణంగా యోగను ఉద్యోగులకు ఏకగ్రత పెరగటానికి మానసిక వత్తిడిని నుంచి ఉపశమనం పొందటానికి బహుళ జాతి సంస్థలు సైతం యోగ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.సైన్యం మొదలుకొని క్రీడల వరకు అనుసరించవలసిందంటూ సూచించడం జరుగుతోంది. వ్యోమగాములకు వారి అంతరిక్ష కార్యక్రమ సంబంధ శిక్షణలో యోగను, ధ్యానాన్ని బోధించడం జరుగుతోంది. ఇది పనితీరును, సహనశక్తిని వృద్ధి చేస్తుంది.

**సమా జంలో సానుకూలమైన మార్పు:**

ప్రస్తుత కాలంలో అనేక జైళ్ళలో ఖైదీలు యోగ సాధన చేసేందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీని వల్ల వారు వారి మనస్సులలో సానుకూలమైన ఆలో చనల పైన దృష్టిని కేంద్రీకరించ గలుగుతారన్న మాట. సమా జంలో సానుకూలమైన మార్పులకు యోగ బాటను పరుస్తోంది.

**యోగా పర్యాటక కేంద్రం:**

ప్రపంచంలో అన్ని మూలల నుండి పర్యటకులు భారతదేశానికి వస్తున్నారు. యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భార తీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రధాని మోదీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువు కునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోదీ చేశారు భారతదేశాన్ని "యోగా పర్యాటక కేంద్రంగా" ప్రోత్స హించడానికి దారితీసింది యోగా ఉపాధికి చేయూతగా ఆర్థిక రంగానికి ఆలంబనగా కీలక పాత్ర పోషిస్తోంది.

శ్రీ నరేంద్ర మోదీ పిలుపు:

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపుమేరకు యావత్ భారతదేశం "యోగా" పై దృష్టి సారించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రులు ప్రతిష్టాత్మకంగా "యోగాంధ్ర 20 25 కార్యక్రమం" ను చేపడుతున్నారు.

**అంతర్జాతీయ యోగా దినోత్సం:**

**విశాఖపట్నం:**

"ఈ ఏడాది జూన్ 21న మనం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సం ఘనంగా జరుపుకోనున్నాం. ఈ చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించాం. గత దశాబ్ద కాలంగా దేశ ప్రజలు ఈ గొప్ప కార్యక్రమానికి అందిస్తున్న ఆదరణ ఒక ప్రత్యేకం. గత పదేళ్లుగా యోగా కేవలం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది జూన్ 21న విశాఖపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "యోగా.. ఒక భూమి, ఒక ఆరోగ్యం" అనే థీమ్తో ముందుకు వెళ్తున్నాం. యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యత స్ఫూర్తిని కూడా ప్రతిబింబిస్తుంది.

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం:**

ఇందులో భాగంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా యంత్రాంగం సమిష్టి కృషితో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులతో, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో యోగాంధ్ర 2025 కార్యక్రమంను నిర్వహించారు.

**సవీత ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్:**

చెన్నై లోని సవీత ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 5000 మందికి పైగా విద్యార్థులు ఉమ్మడి యోగా ప్రోటోకాల్ను ప్రదర్శించడానికి సంపూర్ణ సామరస్యంతో సమావేశమయ్యారు, ఆ తర్వాత 11 నిమిషాల్లో 11 ముద్రల శక్తివంతమైన ప్రదర్శన జరిగింది. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు ఇది ఒక ఉద్యమం.

**తుది వట**

ఈ యోగా దినోత్సవాన్ని మనం ఓ అవకాశంగా తీసుకొని, ఒక ఆరోగ్యవంతమైన జీవితం మరియు ఒక ఆరోగ్యవంతమైన భూమి కోసం కలసి కృషి చేద్దాం. యోగా అనేది ఒక వ్యాయామ పద్ధతి కాదు, అది మనిషిని తను చేరుకోగల అత్యునత్త స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరి జ్ఞానం. "ఒక భూమి, ఒక ఆరోగ్యం" అనే థీమ్ ద్వారా మనం తెలిసికోవలసిన విషయం మన ఆరోగ్యం, మన భూమి ఆరోగ్యం కలిసి పోయినవి. యోగా ద్వారా వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాక, ప్రకృతిని ప్రేమించడం, పరిరక్షించడం కూడా మన బాధ్యత.

**ప్రొఫెసర్. డాక్టర్. శ్రీగౌరి కోసూరి**
**సవీత స్కూల్ ఆఫ్ లా,**
సవీత ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్, చెన్నై

# రూ.7.42 కోట్ల మోసం కేసులో ఐపీఎస్ అధికారిణి భర్త అరెస్ట్

**ఐపీఎస్ అధికారిణి భర్త పురుషోత్తం చవాన్ మరో ఆర్థిక మోసం కేసులో అరెస్ట్**
**సూరత్ వ్యాపారికి రూ.7.42 కోట్లు టోకరా వేసినట్టు ఆరోపణ**
**ప్రభుత్వ కోటా ప్లాట్లు, కాంట్రాక్టుల పేరిట డబ్బు వసూలు**
**ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసుల అదుపులోకి చవాన్**
**గతంలోనూ రూ.24.78 కోట్ల మోసం కేసులో అరెస్ట్ అయిన చవాన్**

మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారిణి భర్త మరో భారీ ఆర్థిక మోసం కేసులో అరెస్ట్ అయ్యారు. ఇదివరకే ఒక చీటింగ్ కేసులో అరెస్టయిన ఆయన, తాజాగా రూ.7.42 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ముంబై ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మహారాష్ట్ర కేడర్కు చెందిన ఐపీఎస్ అధికారిణి రష్మీ కరాండికర్ భర్త పురుషోత్తం చవాన్పై పలు ఆర్థిక నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. గుజరాత్లోని సూరత్కు చెందిన ఒక వ్యాపారితో పాటు మరికొందరిని ఆయన రూ.7.42 కోట్ల మేర మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ కోటా కింద తక్కువ ధరలకే ప్లాట్లు ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా, మహారాష్ట్ర పోలీస్ అకాడమీకి టీ షర్టులు సరఫరా చేసే కాంట్రాక్టును సదరు వ్యాపారవేత్తకు ఇప్పించేందుకు తాను సహాయం చేస్తానని కూడా చవాన్ హామీ ఇచ్చారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు.కాగా, పురుషోత్తం చవాన్ గతంలోనూ ఇలాంటి ఆర్థిక మోసాలకే పాల్పడ్డారు. ముంబై, థానే, పుణే నగరాల్లో ప్రభుత్వ కోటా కింద రాయితీ ధరలకు ప్లాట్లు ఇప్పిస్తానని చెప్పి ఎంతో మందిని నమ్మించారు. ఈ విధంగా దాదాపు రూ.24.78 కోట్ల మేర మోసం చేశారన్న ఆరోపణలపై గత నెలలోనే పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న చవాన్ను, తాజా రూ.7.42 కోట్ల మోసం కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.


# ఏపీలో రప్పా రప్పారాజకీయం..
## సిల్వర్ స్క్రీన్ పై నుంచి పొలిటికల్ డైలాగుల్లా మారి?

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం రాజకీయాలు ప్రతి రోజూ హీటెక్కుతున్నాయి. ఎన్నికలయి ఏడాది పూర్తి కాక ముందే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలయింది. 2019లో టీడీపీ పార్టీ ఓడిపోయినప్పుడు కూడా ఇంతే.ఏడాదిలోనే అప్పుడు కూడా రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల వరకూ కొనసాగాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి పల్నాడు జిల్లా పర్యటనతో మరింత హీటెక్కాయి. రప్పా రప్పా రాజకీయాలు నడుస్తున్నాయి. పుష్ప సినిమాలో డైలాగులు నేరుగా పొలిటికల్ స్క్రీన్ పై ప్రత్యక్ష్యమవుతున్నాయి. మాటల యుద్ధం మొదలయింది. ఇద్దరు ఎవరికి వారు తగ్గేదిలేదు అన్నట్లుగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా యువతను ఆకట్టుకునేందుకు ఇలాంటి నినాదాలతో నేతలు ముందుకు వెళుతున్నారా? అన్నఅనుమానం అందిరిలోనూ కలుగుతుంది.

**సోషల్ మీడియావార్...**

జగన్ పల్నాడు జిల్లాలో పర్యటనలో ఇద్దరు మరణించారని, వారి మృతి జగన్ కారణమని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు కందుకూరులో,గుంటూరులో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో అమాయకులు మరణించిన విషయాన్ని వైసీపీ నేతలు తమ సోషల్ మీడియా పోస్టుల ద్వారా గుర్తు చేస్తున్నారు. నాడు ఇరుకు సందుల్లో పెట్టి జనం వచ్చారని నమ్మించే ప్రయత్నం చేయబట్టే కందుకూరులో అంత మంది మరణించడానికి కారణమని నాడు అధికారంలో ఉన్న వైసీపీ చెప్పి రాష్ట్రమంతటా సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తే, నేడు జగన్ పర్యటనపై ఆంక్షలు విధిస్తూ మూడు వాహనాలకు, వందమందికిమించి వెళ్లడానికి వీలు లేదని చెబుతోంది.

**అధికారంలో ఎవరున్నా...**

నాడు జగన్ అయినా నేడు చంద్రబాబు అయినా ఒకటే లక్ష్యం. సభలకు, సమావేశాలకు, పర్యటనలకు ఎక్కువ మంది జనం వచ్చినట్లు కనపడితే అది సామాన్య ప్రజలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన కట్టడి చేయడానికి కారణమంటున్నారు. ప్రధానంగా ప్రధాన మీడియా మరుగున పడిపోయి సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిన నేటి కాలంలో పర్యటనలకు హైప్ రావడం ఇష్టం లేకనే ఇలాంటి అనవసర ఆంక్షలు పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నాడు జగన్ ఏపీలో రాజకీయ సభలు, సమావేశాలకు ఏకంగా ఒక జీవోను విడుదల చేశారు. దానిపై అప్పట్లో చంద్రబాబు న్యాయపోరాటం చేశారు.

# దివి శివరాంకు జన్మదిన శుభాకాంక్షలు

### తోకల వెంకటేశ్వర్లు

**కందుకూరు పెన్ పవర్, జూన్20**

మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దివి శివరాంకు మోపాడు టిడిపి గ్రామ అధ్యక్షుడు, అభివృద్ధి కమిటీ సభ్యుడు తోకల వెంకటేశ్వర్లు శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్మషం లేని వ్యక్తి, ఆపద అంటే ఎక్కడదాకైనా వచ్చే నాయకుడు కార్యకర్తలకు నిజమైన నాయకుడు శివరాం అని అన్నారు. శివరాం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరారు.



పెన్ పవర్
ప్రకాశం

# అన్నదాతలకు అండగా.. నూతన చరిత్రకు శ్రీకారం...

## జయహో సాంబన్న... అంటూ రైతుల జేజేలు

- బర్లీ రైతులకు బాసటగా కూటమి సర్కార్..
- రైతులు కుటుంబాల్లో ఆనంద వేడుకలు
- రైతు సమస్యను బాధ్యతగా తీసుకున్న ప్రభుత్వం
- ధర లేక కొనుగోలు చేయక అలజడిలో రైతులు
- రైతుల ఆందోళనతో కలత చెందిన"సాంబన్న"
- సమీక్ష నిర్వహించిన తీరు మారని కంపెనీలు
- సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఏలూరి
- సీఎం అధ్యక్షతన మూడుసార్లు క్యాబినెట్ భేటీ
- మంత్రి అచ్చెన్న కొండంత వ్యవ"సాయం"
- బర్లీ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలుకు నిర్ణయం
- బర్లీ కొనుగోలుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- అన్నదాతల చెంతకు నేరుగా యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రెటరీ
- ప్రతిభంధకంగా నిబంధనలు,మార్గదర్శకాలు
- పట్టు వదలని విక్రమార్కుడిలా"సాంబన్న"కృషి
- మొదటి గ్రేడ్ రూ.12వేలు, రెండవ గ్రేడ్ 6 వేలు
- సమస్య పరిష్కారంలో సాంబన్న సూపర్ సక్సెస్
- రైతుల మదిలో సాంబన్న చెరగని ముద్ర...

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

పొగాకు సాగు.. ఏళ్లుగా ఇదే వారి జీవనాధారం. ఆరుగాలం శ్రమించి.. వేలాది ఎకరాల్లో పండించి.. తీరా పంట చేతికొచ్చే సమయానికి ధర లేకపోతే.. గిట్టుబాటు కాకపోతే.. మధ్యవర్తులు నిలువునా ముంచేస్తే.. ఆ బాధ వర్ణనాతీతం. కుటుంబాన్ని పోషించుకోలేక.. కష్టాన్ని రోడ్డుపై వదిలేయలేక.. వచ్చిందే చాలనుకునేవారు కొందరైతే.. ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడేవారు మరికొందరు. ఇలా దిక్కుతోచని స్థితిలో ఉన్న వేలాది రైతన్నల దీనావస్తను చూసి చలించిపోయిందో హృదయం. వారికి అండగా నిలవాలని పరితపించింది. తన సంకల్పబలంతో ప్రభుత్వాన్ని కదిలించింది. పొగాకు మొత్తాన్ని ప్రభుత్వమే కొనాలన్న సంచలన నిర్ణయానికి కారణమైంది. పేదోడి కష్టం తెలిసిన ఆ సున్నిత హృదయం పేరే.. ఏలూరి సాంబశివరావు. దశాబ్దాలుగా పర్చూరు ఎమ్మెల్యే గా కొనసాగుతున్న ఆయనకు.. అక్కడి రైతుల కష్టం తెలుసు.. బర్లీ



కొనుగోళ్లలో దళారులు చేస్తున్న మోసం తెలుసు.. అమాయక రైతుల ఆవేదనా తెలుసు. అందుకే.. కూటమి ప్రభుత్వం రాగానే.. రైతులను ఆదుకునేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు, వ్యవసాయ శాఖ మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు స్నేహ హస్తం... అధికారుల సహకారంతో సాధించారు.. ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని అన్నదాతలకు అండగా నిలిచేలా సంచలన చరిత్రకు శ్రీకారం చుట్టారు.. వేలాది కుటుంబాల్లో ఆనందం నింపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు బాసటగా నిలుస్తుంది. దేశ చరిత్రలో ఎన్నడూ



లేని విధంగా ప్రభుత్వమే మార్క్ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషి పట్టుదలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం మార్కఫైడ్ ద్వారా బర్లి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రేడ్ వన్ 12000 వేలు, గ్రేడ్ 2 6 వేల చొప్పున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా పర్చూరు మార్కెట్ యార్డ్ తో పాటు పలుచోట్ల నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు చేపట్టింది. దీంతో సుమారు 70 వేల ఎకరాలలో 60 మిలియన్ల పొగాకు పంటకు సరైన ధర లభించనుంది. ప్రైవేటు కంపెనీలు కొనుగోలు చేయక, సరైన ధర లేక రైతులు, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి రైతులు పడుతున్న ఇబ్బందులకు చంద్రన్న ను ఒప్పించి... బర్లీ రైతుకు అండగా.... నల్లబర్లీ రైతులు దయనీయ పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీలు కొనుగోలుకు ముందుకు రాక...సరైన ధర లేక,పంట నిల్వ చేయలేక రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారని వివరించారు. రైతుల కష్టాలకు చెలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్ లను సమస్య పరిష్కరించేలా చొరవ చూపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం పలుమార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతు సమస్యలపై ముఖాముఖి నిర్వహించారు. పంటల పరిస్థితిని స్వయంగా చూసి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితిని వ్యవసాయ శాఖ మంత్రి



కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్ కమిషనర్ ఢిల్లీ రావులు ముఖ్యమంత్రి కి నివేదించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే ఏలూరి రైతు కష్టాలను కంపెనీల తీరును నేరుగా ప్రభుత్వానికి విన్నవించారు. స్పందించిన ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. పలుమార్లు క్యాబినెట్ భేటీ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను ఆదుకునేందుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మార్క్ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు ప్రారంభించింది. రైతులను ఆదుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ను ఒప్పించి అన్నదాతలకు సాంబన్న అండగా నిలిచాడు. అన్నదాతల ఆప్తుడిగా రైతులకు అనునిత్యం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాసటగా నిలిచారు.

**రైతు కుటుంబాల్లో సంబరం .....**

తీవ్ర అలజడి ఆందోళనలో ఉన్న బర్లీ రైతులకు ప్రభుత్వం కొండంత అండగా నిలవడంతో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. కంపెనీలు కనికరించుక... ధర పతనం కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వమే నేరుగా రైతుల చెంతకు వచ్చి పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మంత్రి అచ్చెన్న కు అన్నదాతల ఆప్తమిత్రుడు సాంబన్నకు సోదరులు చరిత్రలో ఎక్కడా లేని విధంగా చైతన్య రథాలతో, పూల వర్షంతో బాణాసంచా కాలుస్తూ... కదం తొక్కుతూ సంఘీభావాన్ని ప్రకటించారు.

# నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేస్తాం

### - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 20**

రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్నీ కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్ తో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చీమకుర్తి, మద్దిపాడు, పామూరు, దొనకొండ, కొత్తపట్నం, ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు, నాగులుప్పలపాడు, ఒంగోలు వంటి 10 మండలాలలో 1088 మంది రైతులు 4841 ఎకరాల విస్తీర్ణంలో నల్లబర్లీ పొగాకు సాగు చేసినట్లు చెప్పారు. తద్వారా 50,380 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లి పొగాకు మొత్తాన్నీ మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని ఆమె భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ చరిత్రలో తొలిసారి నల్లబర్లీ పొగాకును మార్క్ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తున్నట్లు చెప్పారు. హెచ్.డి.ఎం. రకం పొగాకును కిలో రూ.120, హెచ్.డి.ఎక్స్. రకం పొగాకును కిలో రూ.60 చొప్పున అధికారులు కొనుగోలు చేస్తారని ఆయన తెలిపారు. తేమ శాతం 20 లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. మార్క్ ఫెడ్ కు విక్రయించాలనుకునే రైతులు ముందుగా సీఎం యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తద్వారా రైతులు ఏ రోజు ఏ ప్లాట్ ఫారం వద్దకు పొగాకును తీసుకురావాలో వారి మొబైల్ కు ముందస్తు సందేశం వస్తుందని వివరించారు. ఈ నిబంధనలు పాటించి అధికార యంత్రాంగానికి సహకరించాలని రైతులకు ఆయన సూచించారు. తమది రైతులకు అండగా నిలిచే ప్రభుత్వమని, పూర్తిస్థాయిలో నల్లబర్లి పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్క్ ఫెడ్ సంస్థ మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు, ప్రాజెక్టు మేనేజర్ కళ్యాణ్ రామ్, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ ఆదిలక్ష్మి, రైతు సంఘాల నాయకులు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధరలకు పొగాకు కొనుగోలు చేయాలి

### - ఒంగోలు సదస్సు లో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించేందుకు ప్రభుత్వాలే ముందుకు వచ్చి పొగాకును కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్ డిమాండ్ చేశారు. పొగాకు కు గిట్టుబాటు ధరలు కోరుతూ ఒంగోలు లోని మల్లయ్య లింగం భవనంలో ఏపీ రైతు సంఘం ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఏపీ రైతు సంఘం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు కొనుగోలు వ్యాపారుల మెడలు వంచి పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పొగాకు రూపం లో వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వాలు ధాన్యం రైతుల సమస్యలను ఏ విధంగా పట్టించుకోవడంలేదని, మద్దతు ధర కంటే రూ.200 నుండి 300 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సాగు చేసిన అనంతరం విదేశాలలో పొగాకు ఎక్కువగా పండిందని పేర్కొనటం దుర్మార్గమన్నారు. రైతాంగ పోరాటాల ద్వారా ప్రభుత్వాలు మార్క్ ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. రైతాంగ పోరాటాల ద్వారా మాత్రమే పొగాకు గిట్టుబాటు ధర వస్తుందని పేర్కొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ 1976లో పొగాకు బోర్డు ఏర్పడిందన్నారు. దేశ విదేశాలలో పొగాకు ఉత్పత్తులు ధరలను బేరీజు వేసుకొని ప్రభుత్వాలు పంట అంచనాలను ముందస్తుగా రైతులకు తెలియజేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ధరలు పతనమయ్యే అవకాశాలు ప్రభుత్వాలకు ముందస్తుగా అవగాహన లేని కారణంగానే రైతులు నష్టపోతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వాల విధానాలు వల్లే దిగుమతులు దిగుమతులు సక్రమంగా జరగటం లేదని, డబుల్ ఇంజన్ సర్కార్లో అన్ని రకాల పంటలకు గిట్టుబాట్లు ధరలు లేవని విమర్శించారు. ఈ సదస్సులో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన అధ్యక్షులు వడ్డే హనుమా రెడ్డి, ఆచార్య రంగా కిసాన్ సంస్థ కార్యదర్శి చుంచు శేషయ్య, ఏపీ రైతు కూలి సంఘం సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరు నాంచార్లు,కాంగ్రెస్ కిసాన్ సంస్థ జిల్లా అధ్యక్షులు దేవరకొండ సుబ్బారెడ్డి లు మాట్లాడారు. ఈ సమావేశంలో కేంద్రం నాయకులు వడ్డేళ్ళ ప్రసాద్, అబ్బూరి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## నాటక కరపత్ర ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 20**

చత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్కార భారతి ప్రకాశం జిల్లా వారి ఆధ్వర్యంలో ఓరియంటల్ పాఠశాల గద్దలగుంట, ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం వారి సౌజన్యంతో ఈనెల 29 ఆదివారం నాడు నిర్వహిస్తున్న జయహో చత్రపతి శివాజీ నాటక ప్రదర్శన కరపత్రాన్ని.. గోడ పత్రాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను వారి పాఠశాలలో నిర్వహించి ఫైనల్స్ ను ఈ నెల 29 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఏకేవీకే కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని తదనంతరం జరిగే నాటకాన్ని తిలకించవలసిందిగా ఓరియంటల్ పాఠశాల కరస్పాండెంట్ ఎన్ కోటి సూర్యనారాయణ కోరారు. చత్రపతి శివాజీ జీవితం యువతకు ఆదర్శమని ఈ నాటకం చూస్తే ఖచ్చితంగా యువత మంచిదారిలో నడుస్తారని తద్వారా దేశ రక్షణకు దేశ అభివృద్ధికి ఉపయోగపడతారని సంస్కార భారతి ప్రకాశం జిల్లా సెక్రెటరీ రంగమన్నారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓరియంటల్ పాఠశాల పిఈటి సోమినేని సురేష్, ఎన్. శ్రీకాంత్, ఆనంద్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ జి రవికుమార్, ఈపూరు శివప్రసాద్, సంస్కార భారత సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సభ




**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 20**

వ్యవసాయ విద్యను అభ్యసించిన విద్యార్థులు డిగ్రీ తరువాత పీజీ కోర్సులు చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ అన్నారు.గురువారం రాత్రి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గౌరవ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ బోధన సిబ్బందితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ విద్యార్దులు డిగ్రీ పూర్తి చేసి ఇతర ఉన్నతమైన విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడి అధ్యాపకులకు,చదువుకున్న కళాశాలకు ,తల్లితండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నల్లమడుగుల పాఠశాల విద్యార్థులకు పాఠ్య సామగ్రి పంపిణీ

### గ్రామస్థుల స్ఫూర్తిదాయక సహకారం

**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 20**

నల్లమడుగుల మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు పౌచ్ లు స్కేల్ పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్ప్నర్లు వంటి ఉపకరణాలను పిల్లలకు అందించారు ఈ విద్యా సామగ్రి పిల్లలలో చదువు మీద మక్కువను పెంచేలా చేసింది.అదేవిధంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం కింద అందిన యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, బూట్లను కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. రామ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్థులు ఇలా ముందుకు వచ్చి విద్యార్థుల చదువులకు తోడ్పడటం అభినందనీయమైన అన్నారు పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అందించాలని అలాగే పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచేందుకు అందరం కలిసి పని చేద్దాం అని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు హమ్మద్, పెంచల నరసయ్య, బత్తుల రవీంద్ర పాఠశాల అభివృద్ధికి సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, ఎస్ఎంసి చైర్మన్ ఫరూక్ మాల్యాద్రి,గ్రామ టిడిపి ఉపాధ్యక్షులు ఎస్. కొండయ్య,కన్వీనర్ ఖాజావలి,గ్రామ పెద్దలు గుర్రం నాగేశ్వరరావు, అజీజ్ భాషా, వై. రామయ్య, జి. రమణయ్య, జి. చెంచయ్య, రవితేజ,తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్

## - ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు







**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

జిల్లాలో భూ సమస్యలతో పాటు వివిధ సర్టిఫికెట్స్ కొరకు వచ్చే అర్జీపై రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో జరిగిన రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించి, రెవెన్యూ అధికారులతో కలసి కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, రెవెన్యూ శాఖ కు పని అప్పగిస్తే పని అయిపోతుందని, ఎలా చేయాలో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ ఇతర శాఖలకు ఆదర్శంగా ఉందని, రానున్న రోజుల్లో కుడా ఇతర శాఖలకు రెవెన్యూ శాఖ ఆదర్శంగా నిలవాలన్నారు. వివిధ భూ సమస్యలపై, సర్టిఫికెట్స్ కొరకు పేద ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు అర్జీలతో వస్తుంటారని, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు వారి సమస్యలను సావదానంగా విని సత్వరం పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు పనిచేసినప్పుడే ప్రజల్లో రెవెన్యూ శాఖపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. భూ సమస్యలతో పాటు వివిధ సర్టిఫికెట్స్ కొరకు వచ్చే అర్జీపై రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించి రెవెన్యు శాఖకు మంచి తీసుకురావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు



సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులను, పదవీ విరమణ చెందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్ సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కు సంబంధించి




బుక్స్, రికార్డ్స్ తో ఏర్పాటు చేసిన స్టాల్ ను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. తొలుత రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని మినీ స్టేడియం నుండి ఏర్పాటు చేసిన ర్యాలీ ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మినీ స్టేడియం నుండి కలెక్టరేట్ వరకు కొనసాగింది. రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారథి, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

### రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి - ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి

### రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం -ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

పర్చూరు నియోజకవర్గంలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయిల్ ఫామ్ కంపెనీ అజంతా సోయ లిమిటెడ్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఏలూరితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని, వేలాది ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని,ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆయిల్ ఫామ్ కు మంచి భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.ఆయిల్ ఫామ్ సంబంధిత ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందన్నారు. లాభదాయక పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపుతారన్నారు. దీనికి అవసరమైన విత్తనాలు, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు వంటి అన్ని విషయంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పడితే స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు లబ్ధి చేకూరుతుందన్నారు.వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం కలుగుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.మార్టూరు మండల ఉద్యాన రైతులు వినూత్న సాగుకు మారలేలా ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి పామాయిల్ సాగు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఒక హెక్టార్కు రూ.20 వేల విలువచేసే 150 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. అంతేకాక నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టార్కు మెయింటెనెన్స్ కింద పెట్టుబడి అందజేసేలా కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖకు అనుసంధానించిందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అజంతా సోయా కంపెనీ ప్రాజెక్టు హెడ్ పాశం సుధాకర్ రెడ్డి , మేనేజర్ సర్తాజ్ బాషా, హార్టికల్చర్ అధికారి హనుమంతు నాయక్ పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలు

### నియోజకవర్గ పరిశీలకులు కనుమూరి బాజీ స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూన్ 20**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు మూల స్తంభాల లాంటివారని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలికులు కనుమూరి బాజీ చౌదరి చెప్పారు శుక్రవారం నాడు పొదిలి పట్టణంలోని సాయి కళ్యాణ మండపంలో శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల కార్యకర్తల సర్వసభ్య సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాజీ చౌదరి మాట్లాడుతూ పార్టీ పరంగా కార్యకర్తలకు సరైన న్యాయం జరుగుతుందని చెప్పారు రాష్ట్రంలోని తెలుగు దేశ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లో కి తీసుకొని వెళ్లాలని సూచించారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలపాడు పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 20**

పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించుటకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ విద్యా సంబంధిత పథకాలను వినియోగించుకొని విద్యార్థిని విద్యార్థులు చక్కగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఉప్పలపాడు గ్రామం నకు చెందిన మండల తెలుగు యువత నాయకులు చెరుకుపల్లి వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్ అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును



మెరుగుపరిచే ఉద్దేశంతో విద్యా వసతులు, ఉచిత యూనిఫారాలు, స్టడీ మెటీరియల్ , మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం వంటి అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేసిందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ విద్యార్థి మిత్ర కిట్ లో ఉన్నటువంటి యూనిఫారాలు వెంటనే కుట్టించుకొని జులై 5వ తేదీ జరగబోయే మెగా పిటియం సమావేశానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు




పాఠ్యపుస్తకాలు, యూనిఫారము, బెల్టు, షూలు కిట్ లో ఉన్నటువంటి అన్ని పరికరాలు గ్రామస్తుల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వెంకటరెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎలికా శ్రీనివాసులు, ఎస్ వహీద్, జోష్ణ, గ్రామ పెద్దలు కత్తులపల్లి వెంకటరెడ్డి,పులి రాజశేఖర్, రసూల్, బలబద్ర యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

# 21న 11 లక్షల మందితో యోగ


– జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా – మినీ స్టేడియంలో వేలాది మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో యోగ సాధన

– పాల్గొన్న ఎస్పీ ఏ.ఆర్ దామోదర్, శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, బిఎన్ విజయకుమార్, మేయర్ గంగాడ సుజాత









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

ఈ నెల 21న జిల్లాలో జరగనున్న అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో 6,458 ప్రదేశాల్లో సుమారు 11 లక్షల మందితో ఒకే సమయంలో యోగ కార్యక్రమం నిర్వహించబడునని, ప్రతి ఒక్కరూ అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఒంగోలులోని మినీ స్టేడియంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, బిఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు తదితరులతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ఈ సంవత్సరం 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మన రాష్ట్రంలోని వైజాగ్ లో జరిగే యోగ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పాల్గొనబోతున్నట్లు తెలిపారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ చేయబోతున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది ప్రజలు, ఒక లక్షా 50 వేల ప్రదేశాల్లో ఒకే సమయంలో యోగ సాధన చేయబోతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా గత నెల మే 21వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో యోగ పై అవగాహన కల్పించేలా యోగాంధ్ర కాంపెయిన్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలో 11 లక్షల మంది ప్రజలను యోగ కోసం రిజిస్టర్ చేసి వారందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రేపు జిల్లాలో జరగనున్న అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో 6,458 ప్రదేశాల్లో ఒకే సమయంలో యోగ కార్యక్రమం నిర్వహించబడునని కలెక్టర్ వివరించారు. శుక్ర వారం వచ్చిన స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఇదే స్ఫూర్తి తో రేపు జరగనున్న యోగ దినోత్సవ వేడుకల్లో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. 21వ తేదీ యోగ దినోత్సవం అనంతరం కూడా ప్రతి ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజలను కోరారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ, భారత దేశంలో పుట్టిన యోగా యొక్క ప్రాముఖ్యతను గుర్తించి అప్పటి భారత ప్రధాని నరేంద్ర మోదీ కోరిన మీదట ఐక్యరాజ్య సమితి 2014 జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించడం జరిగిందని, అప్పటినుండి ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. రేపు జరగనున్న 11వ అంతర్జాతీయ దినోత్సవం రోజున వైజాగ్ లో భారత ప్రధానమంత్రి పాల్గొను యోగ కార్యక్రమంలో సుమారు 5 లక్షల మంది పాల్గొనుచున్నారన్నారు. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో యోగ యొక్క ఆవశ్యకతను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర క్యాంపెయిన్ ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ యోగ ను జీవన శైలిలో భాగం చేసుకొని ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని, రేపు జరగనున్న అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని యోగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ, నేటి దైనందిన జీవితంలో అనేక ఒత్తిడి లు, సమస్యలతో జీవనం సాగిస్తున్న తరుణంలో వాటిని అధికమించాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగ సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన ఆరోగ్యాన్ని, మన ఆశయాన్ని, మన అభివృద్ధిని సాధించాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినట్లుగా ఆరోగ్యం బాగుంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చునన్నారు. యోగను ప్రజలందరి జీవితంలో భాగం చేయడానికి జిల్లాలో నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. రేపు జరగనున్న యోగ దినోత్సవం కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ మాట్లాడుతూ, 2047 లో ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ ను సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర క్యాంపెయిన్ ను నెల రోజుల పాటు నిర్వహించడం జరిగిందన్నారు. యోగ యొక్క గొప్పతనాన్ని తెలియ చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యంగా మహిళలకు యోగ పట్ల అవగాహన కల్పించినట్లయితే ఆ కుటుంబం ఆరోగ్యకరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గాయకులు శరత్ కుమార్ రూపొందించిన యోగ గేయాన్ని ఆవిష్కరించి గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, డిఆర్డిఏ, మెప్మా పిడి లు నారాయణ, శ్రీహరి, ఆయుష్ శాఖ ఆర్డిడి పద్మజాతి, జిల్లా విద్య శాఖాధికారి కిరణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేడి రవి కుమార్, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, డిఎస్డిఓ రాజరాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ ఆధాలలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేసేవిధంగా కక్షి దారులకు అవగాహన కల్పించాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్




**గిద్దలూరు, పెన్ పవర్ జూన్ 20**

జులై 5న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేసే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని గిద్దలూరు న్యాయవాదులకు శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఏ.ఓంకార్ కోరాలు. రాజీ పడటం వలన విలువైన సమయ పాలన, ధనము ఆదా అవుతుందని తెలియజేసారు. రాజీమార్గమే రాజమార్గమని, ఇరు పార్టీలు ప్రశాంతంగా కలిసి ముందుకు సాగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం నందు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్ చంద్ర, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పి.ఎన్. శేషశ యానరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ. తిరుమల ప్రసాద్ ,ఏ జి పి .డి. సంగీతరావు, సీనియర్ న్యాయవాదులు పి. రాజశేఖర్ రెడ్డి ,కె. హిమశేఖర్ రెడ్డి, ఎస్.వి భాస్కరరావు, కె.రవి ప్రకాష్ బాబు ,బి. ఐజాక్ మొగల్ హజరాంబి, జూనియర్ న్యాయవాదులు జె.రంగమోహన్, డి. సిద్దయ్య, వివిఎన్ .సుధీర్ కుమార్, కె. విక్రమాదిత్య రెడ్డి ,పి. లావణ్య పాల్గొన్నారు.

## 21వ తేదీ ఇడమకల్లు, పుల్లారెడ్డి పల్లె పంచాయతీలలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేత.

కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు ప్రకటన.




**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**

కొమరోలు మండలంలోని ఇడమ కళ్ళు ,పుల్లారెడ్డి పల్లె గ్రామపంచాయతీలలోని గ్రామాలకు ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో కొత్త లైన్లు ఏర్పాటు కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ శనివారం పుల్లారెడ్డి పల్లె, ఎడమ కళ్ళు గ్రామపంచాయతీలలో కొత్త లైన్ ఏర్పాటు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు .ఆ కారణంగా ఇడమకల్లు, నరసింహునిపల్లి, లింగారెడ్డి పల్లె, కిష్టంపల్లి ,బాలిరెడ్డి పల్లె, ఎర్రంశెట్టి వానిపల్లి, పుల్లారెడ్డిపల్లి గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తుందని ఆయన చెప్పారు. కావున విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని శ్రీనివాసులు విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

## పొదిలి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించిన అక్కచెరువు గ్రామస్తులు



**పొదిలి, పెన్ పవర్, జూన్ 20**

పొదిలి మండల రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం నాడు అక్కచెరువు గ్రామానికి చెందిన పలువురు ముట్టడించారు కార్యాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన పలువురు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్లను కట్టుకొని నివసిస్తున్నామని చెప్పారు అయితే ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తమ జీవనానికి ఆటంకం కలిగిస్తున్నారని వారు చెప్పారు మురుగునీరు కూడా పోకుండా అడ్డం వేయడంతో పాటు దురుసుగా ప్రవర్తిస్తున్నారని అతని వల్ల తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు తెలిపారు తమ సమస్యను సంబంధిత అధికారులు పట్టించుకోని సదరు వ్యక్తి నుండి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.

## మాజీ మంత్రి దగ్గుబాటిని కలిసిన మండవ





**కార్పోరేషన్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 20**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ని శుక్రవారం ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ఏర్పాటుకు జరిగిన పరిణామాలను దగ్గుబాటికి వివరించారు. సంఘం ద్వారా కుల,మతాలకు అతీతంగా చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన కు విశదీకరించారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అభివృద్ధికి తమ అమూల్యమైన సలహాలు సూచనలు ఇవ్వాలని దగ్గుబాటిని మండవ మురళీకృష్ణ కోరారు. దగ్గుబాటిని కలిసిన వారిలో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు ఉన్నారు.

## ఈవిఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

జిల్లాకు సంబంధించి ఈవిఎంలను భద్రపరచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. తమీమ్ అన్సారియా, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఒంగోలు నగరంలోని మామిడిపాలెం లో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం) గోదాములను శుక్రవారం స్టేట్ ఎలక్షన్ డిప్యూటీ సిఈఓ విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ లో భద్రపరచిన ఈవిఎం యంత్రాలు బి.యు లు, సియు లు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షుణంగా పరిశీలన చేశారు. అప్రమత్తుంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డిఒ లక్ష్మి ప్రసన్న, కలెక్టరేట్ సూపరింటిండెంట్ శ్రీనివాస రావు, వివిధ రాజకీయ పార్టీల తరుపున, టీడీపీ నుండి కోనేటి వెంకటరావు, వైసీపీ తరుపున దామరాజు క్రాంతికుమార్, బీజేపీ తరపున గుర్రం సత్యం, మాకినేని అమర్ సింహ , కాంగ్రెస్ పార్టీ తరపున ఎస్.కె రసూల్, రాజశేఖర్ రెడ్డి, ఉపేంద్ర, నవీన్, ఇతర రెవెన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో కొన్ని శాఖల సమస్యలు సత్వర పరిష్కారం

### కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కామూరి అమూల్య











**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**

ప్రజల భాగస్వామ్యంతో కొన్ని సమస్యలు సత్వర పరిష్కారం కాగలవని కొమరోలు మండలాధ్యక్షురాలు కామూరి అమూల్య పేర్కొన్నారు. కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది .ఆ సమావేశానికి ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షత వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తూ మండల గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు .డ్రైనేజీల సమస్య పరిష్కారానికి ప్రజల సహకారం ఎంతో అవసరం అని పేర్కొన్నారు. కొమరోలు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నదని కొమరోలు ఎంపీటీసీలు షేక్ మౌలాలి షేక్ సుభాని తెలియజేశారు .అయితే శాశ్వత పరిష్కారం కనుగొన్నంతవరకు ప్రజలు తమ ఇళ్ళ ముందు మురికి కాలువలు ఏర్పాటు చేసుకొని మురుగునీరు కాలువలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అమూల్య కోరారు .అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించి వారి సహకారంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రోడ్డు భవనాల శాఖ పై జరిగిన సమీక్షలు పాల్గొన్న కొమరోలు మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి ,ఎంపీటీసీలు షేక్ సుభాని, ఎన్ తిరుపతి రాజు మాట్లాడుతూ ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్లు పూర్తిగా ఆక్రమాలు గురి అయ్యాయని ,దీనితో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావడమే కాకుండా ప్రమాదాలకు కూడా గురి అవుతున్నారని వారు వివరిస్తూ ఆర్ అండ్ బి శాఖపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదారు సంవత్సరాలుగా తాము అనేక పర్యాయాలు సర్వసభ్య సమావేశాలలో ప్రస్తావిస్తున్నప్పటికీ ఆర్ అండ్ బి శాఖ అధికారులు రోడ్డు మార్జిన్ల ఆక్రమణలు తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు .రోడ్డుకు ఇరువైపులా గల గృహాల వారు ,వ్యాపారస్తులు రోడ్డు మార్జిన్ లను పూర్తిగా ఆక్రమించుకొని ఉన్నారని ,దీనితో వ్యాపార సంస్థలలోనికి వెళ్లవలసిన వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయవలసి వస్తుందని ,అయితే పోలీసులు రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధిస్తున్నారని పేర్కొన్నారు. కావున ఆర్ అండ్ బి రోడ్ల మార్జిన్ లను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. కొమరోలు నుంచి పురుషోత్తం పల్లెకు వెళ్లెందుకు నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ లను కొందరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని బంకులు ఏర్పాటు చేశారని తాటిచెర్ల ఎంపిటిసి సభ్యులు కామూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బి శాఖ అధికారి మాట్లాడుతూ గిద్దలూరు రాజుపాలెం ఇడమకల్లు ఆర్ అండ్ బి రోడ్డులో 2/0 నుంచి 7/0 వరకు ఐదు కిలోమీటర్ల మేర డబల్ రోడ్డు ఏర్పాటు చేయుటకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యుత్తును శాఖ పై జరిగిన సమీక్షలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తమ శాఖ వివరాలు వెల్లడిస్తుండగా మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు షేక్ సుభాని మాట్లాడుతూ పట్టణంలో లో వోల్టేజి సమస్య తీవ్రతరంగా ఉండదని గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు ఎత్తు సిసి రోడ్ల ఏర్పాటుతో గతంలో వేసిన విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గిపోయిందని దీనితో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని అందువల్ల పలు వీధులలో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణ కాలనీలో లో ఓల్టేజీ సమస్య తీవ్రతరంగా ఉన్నదని వివరించారు. ఆ సమస్యపై విద్యుత్ శాఖ ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్ఫార్మర్ నుంచి కొత్త లైన్ ఏర్పాటు చేయుటకు కండక్టర్ కొరత కారణంగా జాప్యం జరుగుతున్నదని త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్టీసీ శాఖపై జరిగిన సమీక్షలో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు కొమరోలు గిద్దలూరు మధ్య ఆర్టిసి బస్సులో కొరత ఎక్కువగా ఉన్నదని దీనితో ప్రయాణికులు ప్రమాదాలు అని తెలిసినప్పటికీ ఆటోలలో ప్రయాణిస్తున్నారని తెలిపారు కొమరోలు నుంచి గిద్దలూరు వెళ్లెందుకు ఉదయం ఆరున్నర గంటల లోపు ఆర్టీసీ బస్సు లేదని ప్రత్యేకంగా రాత్రి 8 గంటల తర్వాత గిద్దలూరు వెళ్లెందుకు బస్సు సౌకర్యం లేదన్నారు గిద్దలూరు లోని రైల్వే స్టేషన్ లో తెల్లవారుజామున దిగిన ప్రయాణికులు వచ్చేందుకు గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని అయితే సదరు ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో రైలు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా విద్యార్థు లు పాఠశాలలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొమరోలు మూడు ఎంపీటీసీ సభ్యులు ఎన్ తిరుపతి రాజు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పై జరిగిన సమీక్ష సందర్భంగా కొమరోలు ఎంపీటీసీ షేక్ సుభాని మాట్లాడుతూ కొమరోలు గ్రామపంచాయతీలో కొమరోలు మండలం మండల పరిషత్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయని పేర్కొన్నారు .దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 2019- 2024 మధ్యకాలంలో మంజూరైన గృహాల నిర్మాణాలకు బీసీ ఎస్సీలకు అదనంగా 50 వేల రూపాయల చొప్పున బిల్లులు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు .2.0 పథకం ద్వారా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లుగా ఆయన తెలిపారు కావున ఆసక్తిగల లబ్ధిదారులు తమ దరఖాస్తులను కొమరోలు లోని హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో ఎంపీపీ అమూల్య ,డిప్యూటీ ఎంపీడీవో జేసిహెచ్ చెన్నారావు, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, కొమరోలు పిహెచ్సి వైద్యాధికారి దేవరశెట్టి చంద్రశేఖర్, ఎస్సై నాగరాజు ,ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి ,ఏపీ ఓ మహాలక్ష్మి దేవి ,ఏపిఎం రఘునాథ బాబు ,హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి ,ఆర్డబ్ల్యుసిఐ శ్రీనివాసులు,,హార్టికల్చర్ ఏ ఈ శ్వేత, పంచాయతి రాజ్ ఈరయ్య, ఎఫ్ బి ఓ లక్ష్మీనారాయణ, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, ఎంపీటీసీలు షేక్ మౌలాలి ,షేక్ సుభాని ,ఎం తిరుపతి రాజు,జాజం వెంకటరమణ ,కామూరి శ్రీనివాసరెడ్డి ,వెంకటేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం

### బిజెపి నాయకురాలు విజయలక్ష్మి స్పష్టం






**పొదిలి, పెన్ పవర్, జూన్ 20**

యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల నుండి జరుగుతున్న యోగా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నాడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మునిసిపల్ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి ప్రోత్సాహంతో యోగా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ యోగా చేయాల్సి ఉందన్నారు అందువల్ల దేహ దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందన్నారు భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో యోగా కార్యక్రమాలను దేశమంతట నిర్వహిస్తున్నారని చెప్పారు ఈ కార్యక్రమాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయని విజయలక్ష్మి చెప్పారు శనివారం నాడు విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగ ప్రదర్శనకు భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని ఆమె తెలిపారు అలాగే పొదిలిలో కూడా శనివారం ఉదయం నుండి యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని విజయలక్ష్మి కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి, విజయలక్ష్మి యోగ ప్రదర్శనలు జరిపి పలువురి చేత మన్ననలు పొందారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

# ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ - జూన్ 30 వరకు అప్లై చేసుకోండి -తహశిల్దార్ వెంకటేశ్వరరావు

**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 20**

రాష్ట్రంలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందని పుల్లల చెరువు తహశీల్దార్ కె. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్‌లో భాగంగా, సాధారణంగా విధించే రూ. 500/- రుసుము నుండి మినహాయింపు ఇచ్చి, కేవలం రూ. 50/- మాత్రమే నామమాత్రపు ధరఖాస్తు రుసుముగా చెల్లిస్తే, జాయింట్ పట్టాదారుల భూములకు ఉచితంగా సబ్ డివిజన్ సేవలు కల్పించనున్నారు. ఈ రుసుము సంబంధిత గ్రామ సచివాలయాల్లో చెల్లించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.ఈ ప్రత్యేక సేవను మండల ప్రజలు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం వంటి పథకాలు అందుకునేందుకు ఇది రైతులకు మంచిన అవకాశమని ఆయన అన్నారు.




# జులై 5 జాతీయ లోక్ అదాలత్

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 20**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశముల మేరకు జులై 5. న రాష్ట్రవ్యాప్తంగా జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా గిద్దలూరు కోర్టుల ప్రాంగణం లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు . కోర్టులలో పెండింగ్ లో ఉన్న అన్ని రకముల సివిల్ కేసులు , చెక్ బౌన్స్ కేసులు , భరణం కేసులు , గృహహింస కేసులు , రాజీ పడదగిన క్రిమినల్ కేసులు , కోర్టుల వరకు వెళ్ళని ప్రీలిటిగేషన్ కేసులు అనగా బ్యాంకులకు సంబంధించి ,టెలిఫోన్లకు సంబంధించి ,పంచాయతీల ఆస్తి పన్నులు , బిల్డింగ్ ప్లాన్ లు, మ్యుటేషన్ ,నీటి కలుషితము , వాతావరణము కలుషితములకు సంబంధించిన అన్ని రకముల కేసులను ఇరు పార్టీల ఆమోదము మేరకు రాజీ చేయబడునని , కక్షిదారులు అందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవలసినదిగా గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఏ.ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పామూరు లో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్

**పామూరు, పెన్ పవర్ జూన్20**



దాదాపు 30 వేల జనాభా కలిగిన పట్టణంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు చేర్పులు మార్పులకు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు అధికారు లకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదన్నారు. ఆధార్ లో చేర్పులు మార్పులకు మండలంలోని నుచ్చుపోద, దాదిరెడ్డిపల్లి సచివాలయాలకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. గతంలో పోస్ట్ ఆఫీస్ ఉన్న ఆధార్ కేంద్రం మూతపడిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పట్టణంలోని ఏదో ఒక సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, గతంలో పోస్ట్ ఆఫీస్ లో ఉన్న ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ప్రభాకర్ కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు సైతం

**మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చిన ఎస్సై నాగరాజు.**

**శాంతి భద్రతల పరిరక్షణతో ప్రజల సమస్యల పరిష్కారం కూడా ఎంతో అవసరం.**









**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**

శాంతి భద్రతల పరిరక్షణ కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా పోలీసులు తమ వంతుగా కృషి చేస్తారని నిరూపించారు కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు. సాధారణంగా పోలీస్ అధికారులు సిబ్బంది ప్రజా ప్రతినిధుల పర్యటనలు ,సమావేశాలు బహిరంగ సభల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడం సర్వసాధారణంగా జరుగుతూ ఉంటుంది. బహిరంగ సభలు, సభలు, జరిగే సందర్భాలలో పోలీసు అధికారులు ,సిబ్బంది సభలు జరిగే ప్రదేశానికి కార్యాలయాలకు వెలుపల ఉండి విధులు నిర్వహిస్తూ శాంతి భద్రతలను పరిరక్షిస్తూ పర్యవేక్షిస్తూ ఉంటారు. అయితే అధికారులు ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొని ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించే కార్యక్రమాలలో పోలీస్ అధికారులు పాల్గొనటం అరుదుగా జరుగుతూ ఉంటుంది .కాగా కొమరోలు ఎస్ఐ నాగరాజు కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధి వలె పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి తగు సూచనలు సలహాలు ఇచ్చిన అరుదైన, ఆసక్తికరమైన సంఘటన శుక్రవారం కొమరోలు మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకున్నది. కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల అధ్యక్షురాలు కామూరి అమూల్య అధ్యక్షతన జరిగింది. ఆ సమావేశానికి పలు శాఖల అధికారులు ,సిబ్బంది, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అయితే సమావేశం జరుగుతున్న హాలులోకి ఎస్సై నాగరాజు వచ్చారు. అప్పటికే కొన్ని శాఖల సమీక్ష ముగిసింది. ఎస్ఐ నాగరాజు రాకను గమనించిన మండల అధ్యక్షురాలు కామూరి అమూల్య, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు ఎస్ఐ నాగరాజును వేదికపైకి ఆహ్వానించారు. దీనితో ఆయన వారి ధన్యవాదాలు తెలుపుతూ వేదికపై కూర్చున్నారు .ఆ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖపై జరుగుతున్న సమీక్ష లో ఆయన పాల్గొంటూ ఆర్ అండ్ బి రోడ్ల మలుపులో చిల్ల చెట్లు అధికంగా పెరిగి ఉన్నాయని ,వాటిని జెసిబిల సహకారంతో తొలగించి రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్ అండ్ బి శాఖ అధికారికి సూచించారు, రోడ్లపై ఏర్పడిన గుంతలు గోతులను తక్షణమే పూడిపించాలని తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అంతేకాక అనేక మంది ప్రాణాలు కూడా కాపాడవచ్చని ఆయన తెలిపారు, కొమరోలు పట్టణంలో ఆర్ అండ్ బి గ్రూప్ లోకి ఇరువైపులా మార్జిన్లు ఆక్రమణ గురి అయ్యాయని దీనితో రోడ్డు ఇరుకుగా మారి ప్రజలకు పాదాచార్యులకు వినియోగదారులకు ఇబ్బందికరంగా మారిందని అందువల్ల ఆక్రమణ లను తొలగించాలని ఎస్సై కోరారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖపై జరిగిన సమీక్షలో ఆయన పాల్గొంటూ, వీధుల్లో ఏర్పాటు చేసిన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా రోడ్లపై ప్రవహించే మురుగునీరు ఇరుగుపొరుగు వారు ఘర్షణలు పడేందుకు దారితీస్తున్నదని , ఇలాంటి కేసులు తమకు ఇటీవల ఎక్కువగా వస్తున్నాయని, అందువల్ల మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పంచాయతీరాజ్ ఏఈ ఈరయ్యతోపాటు పంచాయతీ గ్రామ సచివాలయాల కార్యదర్శులను కోరారు. పంచాయతీరాజ్ రోడ్ల ఇరువైపుల పెరిగిన చిల్లచట్లను జెసిబి ల సహాయంతో వెంటనే తొలగించాలని లేనియెడల తానే జెసిబిల సహాయంతో తొలగింప చేసి అందుకు అయినా ఖర్చుకు సంబంధించిన బిల్లును సంబంధిత అధికారులకు పంపిస్తానని ఎస్సై వివరించారు. ఆర్టీసీ శాఖపై జరిగిన సమీక్షలు ఆయన పాల్గొంటూ ఆర్టీసీ బస్సులను కొమరోలు లోని ఆంజనేయస్వామి ఆలయం వరకు నడిపి అక్కడ తిప్పుకొని వెళుతున్నారని ,ఇప్పటికే ఆంజనేయస్వామి ఆలయ కూడలి విద్యార్థులు ,ప్రజలతో రద్దీగా ఉంటున్నదని, దీనితో అక్కడ బస్సులు తిప్పుకోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని అందువల్ల బస్సులను మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు వరకు తరలించుకు వెళ్లి అక్కడ తిప్పుకొని వెళ్లాలని ఆయన సూచించారు. చాలామంది ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను రోడ్డుపై నిలబెట్టి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని ,దీనితో వెనుక వచ్చే వాహనాలు అదుపుతప్పి బస్సులను ఢీ కొట్టి ప్రమాదాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని ,అందువల్ల బస్సులను రోడ్డు మార్జిన్లో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా డ్రైవర్లకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన ఆర్టీసీ అధికారిని కోరారు .అందుకు విరుద్ధంగా రోడ్డుపై బస్సులు నిలబెట్టి ప్రయాణికులు ఎక్కించుకోవడం, దింపటం లాంటి సంఘటనలకు జరిగితే తాము సదరు బస్సు డ్రైవర్ కు 10 ,000 రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. విద్యుత్ శాఖ పై జరిగిన సమీక్షలో ఎస్ఐ నాగరాజు పాల్గొంటూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ఎత్తైన స్తంభాలు ఏర్పాటు చేయాలని, తక్కువ ఎత్తులో తీగలు వేలాడుతున్న ప్రాంతాలను గుర్తించి వాటిని సవరించాలని, ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులకు సలహా సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పలు శాఖలకు సంబంధించిన సమీక్షలో ఎస్సై నాగరాజు ప్రజా ప్రతినిధి వలె పాల్గొంటూ సంబంధిత అధికారులకు సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చి పలువురిని ఆశ్చర్యానికి గురి చేశారు. అనంతరం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ప్రయాణించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల జరిగిన సందర్భాలలో ప్రాణాలనుకాపాడుకోవచ్చని చెబుతూ హెల్మెట్లు ధరించకుండా ప్రయాణించే వారికి వేయి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# వివాహానికి రండి

**వధూవరులను ఆశీర్వదించండి**



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జూన్ 20**

పట్టణంలోని (సూర్య)కళ్యాణమండపంలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ మరియు న్యాయవాది డి.సుధీర్ బాబు వెడ్స్ అనిత ల వివాహ మహోత్సవములో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొంటారని, అదే క్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభిమానులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించాలని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ అడ్వైజర్ డిపి యేసయ్య ఆహ్వానం పలికారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**ప్రమాదాల నుంచి ప్రాణాలతో బయటపడి ఎందుకు హెల్మెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.**

**కొమరోలు మండల పరిషత్ సర్విసభ్య సమావేశంలో**

**కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎస్ఠై జక్కుల నాగరాజు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు కోరారు. కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు కామూరి అమూల్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆ సందర్భంగా ఎస్ఐ నాగరాజు సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ , ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు ముందస్తు చెప్పి రావని, అందువల్ల అనుకోకుండా ప్రమాదం జరిగితే ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను రక్షించుకునేందుకు హెల్మెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. స్త్రీ పురుష భేదం లేకుండా ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనుకోని విధంగా ప్రమాదం జరిగినప్పటికీ హెల్మెట్ ధరించి ఉండటం వల్ల గాయాలతో బయటపడి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆయన సూచించారు. హెల్మెట్ దరించకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే 1000 రూపాయలు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. అంతేకాక మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ఫోన్లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని ఆయన చెప్పారు . ఇన్నోవా కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఇటీవల కాలంలో తాటిచెర్ల మోటు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని ఆ ప్రమాదంలో 6 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని, అదేవిధంగా బ్రాహ్మణపల్లి కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనదారున్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో మదవపల్లి గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడని తెలిపారు. కావున ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ కొనుగోలు చేసి ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. పోలీసులు విధిస్తున్న జరిమానాలను చూసి బాధపడే కంటే హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయడం ఎంతో శ్రేయస్కరమని ఆయన తెలిపారు. ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే అతని కుటుంబం ఎన్నో కష్టనష్టాలకు, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నదనే విషయాలను ప్రతి ఒక్కరు అవగాహన చేసుకుని సురక్షిత ప్రయాణాలు చేయాలని ఆయన ఎస్సై నాగరాజు హితవు పలికారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురికి జైలు శిక్ష జరిమానా విధింపు

**ఒక్కొక్కరికి 10వేల రూపాయల జరిమానాలతో పాటు ఐదు రోజులు జైలు శిక్ష.**

**జరిమానా చెల్లించని ఎడల మరో 15 రోజుల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పిన గిద్దలూరు న్యాయమూర్తి కే భరత్ చంద్ర.**

**వివరాలు వెల్లడించిన కొమరోలు ఎస్సై నాగరాజు.**

**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల లోని ఇరువురు వ్యక్తులకు గిద్దలూరు న్యాయమూర్తి కే భరత్ చంద్ర ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానాలతో పాటు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు .కొమరోలు మండలానికి చెందిన ఇరువురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమ తనిఖీల్లో పట్టుబడ్డారని ఆయన తెలిపారు. ఆ మేరకు ఇరువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. సదరు ఇద్దరు వ్యక్తులను శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికి ఐదు రోజులు జైలు శిక్ష, 10వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఆయన తెలిపారు. పదివేల రూపాయలు జరిమాన చెల్లించని యెడల, మరో 15 రోజులపాటు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి భరత్ చంద్ర సంచలన తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు. కావున ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడుపుతూ పట్టుబడితే, జైలు శిక్ష ,జరిమానా తప్పదని ఎస్సై నాగరాజు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో గత వారంలో గిద్దలూరు న్యాయమూర్తి ముగ్గురికి జైలు, శిక్ష జరిమానా విధించారని ఆయన గుర్తు చేశారు.



## రామయ్య పార్థివదేహానికి ఎమ్మెల్యే దామచర్ల నివాళులు





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 20**

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి రామయ్య పార్థివ దేహానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు నివాళులర్పించారు. కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన పార్థివ దేహానికి పూలమాల వేశారు. రామయ్య మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. రామయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రామయ్య కుమారుడు ఎమ్మెల్సీ శ్రీకాంత్ ను పరామర్శించారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు జరిమానా జైలు శిక్ష




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 20**

బేస్తవారిపేట మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 5 మందికి గిద్దలూరు కోర్టు జరిమానా తో పాటు జైల్ శిక్ష విధించింది . మద్యం తాగి వాహనం నడిపిన 5 మందిని డ్రంకన్ డ్రైవ్ లో పరీక్షించిన బేస్తవారిపేట ఎస్సై రవీంద్రారెడ్డి గిద్దలూరు కోర్టులో నిందితులను ప్రవేశపెట్టారు. కోర్టులో న్యాయమూర్తి కె. భరత్ చంద్ర ఒక్కొక్కరికి 10 వేలు జరిమానా విధించడంతో పాటు ఒకరికి 5 రోజులు ఇద్దరికీ 3 రోజులు మరో ఇద్దరికి 2 రోజులు శిక్ష విధించారు. ముద్దాయిలు 10వేలు జరిమానా కట్టని యెడల మరో 15 రోజులు పాటు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు .

## వైసీపీ కార్యకర్తలను పరామర్శించిన ఉడుముల, అన్నా




**పొదిలి, పెన్‌పవర్, జూన్ 20**

ఒంగోలు సబ్ జైల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలను శుక్రవారం నాడు మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాసులు రెడ్డి, అన్నా రాంబాబు లు పరామర్శించారు ఇటీవల పొదిలి లోని పొగాకు బోర్డును సందర్శిం చి, పొగాకు రైతుల కష్టనష్టాలను తెలుసుకునేందుకు విచ్చేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి అరెస్టయి ఒంగోలు లోని కారాగారంలో కొందరు వైసీపీ కార్యకర్తలు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు కాగా మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాసులు రెడ్డి, అన్న రాంబాబులు వారిని పరామర్శిం చి, ధైర్యం చెప్పారు వారి వెంట హెచ్ ఎం పాడు ఎంపీపీ గాయం సావిత్రి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, వైసిపి లీగల్ టీం నగరికంటి శ్రీనివాసరావు, ధర్నాసి హరిబాబు తదితరులు ఉన్నారు.

## మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారిగా మామిళ్ళపల్లి శ్రీనివాసులు

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 20**



పొదిలి మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ పూర్తి అదనపు భాధ్యతలతో మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా మామిళ్ళపల్లి శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మార్కాపురం డివిజన్ విద్యాశాఖ బలోపేతానికి, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ స్థాయిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలుర ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆయనకి శుభాకాంక్షలు తెలిపార. మార్కాపురం మండల విద్యాశాఖాధికారి రాందాస్ నాయక్,రామాంజనేయరెడ్డి, మునగాల చంద్రశేఖర్ రెడ్డి, వి.శ్రీదేవి,వై.వి సుబ్బారెడ్డి, యం.సుధాకర్ ,కె.శర్వాణి, బాలుర ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు ఓ.వి.వీరారెడ్డి, సైమన్,రవిశేఖర్,రమేష్ రెడ్డి పండిత పరిషత్ రాష్ట్ర భాధ్యులు రవిచంద్ర తదితరులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రకాశం రామయ్యకు నివాళులర్పించిన ప్రముఖులు










**కందుకూరు పెన్ పవర్,జూన్ 20**
ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత, అందరివాడు, ఎంతోమంది పేద విద్యార్థులకు తమ కళాశాల ద్వారా విద్యను అందించిన విద్యాదాత డాక్టర్ కంచర్ల రామయ్య పార్థివదేహానికి ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు దంపతులు, పరుచూరి శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దర్శి టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ దంపతులు, ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీ, 20 సంవత్సరాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, ఆర్టీసీ జోనల్ చైర్మన్ మునిరత్నం, దామచర్ల పూర్ణచంద్రరావు, మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, ఈదర మోహన్, టిడిపి నాయకులు చదలవాడ చంద్రశేఖర్, బెల్లం జయంత్ బాబు, పోటు పెదబాబు దంపతులు తెలుగుదేశం పార్టీ నాయకులు దామల్లేశ్వరరావు, చిడిపోతు వెంకట సురేష్ బాబు, వడ్లమూడి సురేష్, బెజవాడ ప్రసాద్, చిలకపాటి మధుబాబు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు ఘనంగా నివాళులర్పించారు.

## జె వి వి జిల్లా మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



**పామూరు, పెన్ పవర్, జూన్20**
ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభల గోడ పత్రిక ను పామూరు మండల యం.పి.డి.ఓ ఎల్ బ్రహ్మయ్య ఆవిష్కరించారు. ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు పట్టణంలో మయూరి ఫంక్షన్ హాల్లో జూన్ 22వ తేదీ ఆదివారం ఉదయం పదిగంటలకు జరగనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు షేక్ గయాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా, ఆరోగ్యం, పర్యావరణం , సైన్స్ అనే అంశాల మీద చర్చ జరుగుతుందని ప్రధాన వక్తగా జె వి వి జాతీయ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు జీవన శైలి అనే అంశం మీద ప్రధాన ఉపన్యాసం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా నూతన కమిటీని కూడా అదే రోజు ఎన్నుకుంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా జె వి వి నాయకులు డా. కె టి సి పాపారాయుడు, పామూరు మండల అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, స్వయం కృషి సేవ సంస్థ అధ్యక్షులు నాయబ్ రసూల్,మానవతా సేవా సంస్థ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి ఇంకా పామూరు పట్టణంలోని జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొనీ ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా జన విజ్ఞాన వేదిక నాయకులు పిలుపునిచ్చారు.

## 22న సెకండరీ గ్రేడ్ టీచర్.. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**
డిఎస్సీ 1998, డిఎస్సీ -2008 కు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులకు ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటలకు ఒంగోలు డిఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్ సంతపేట నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ కు తప్పకుండ హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

## 21న అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాల నిర్వహించి జయప్రదం చేయాలి

**అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించాలి.**
**ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలి.**
**కొమరోలు డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 20**
జూన్ 21వ తేదీ జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించి జయప్రదం చేయాలని కొమరోలు డిప్యూటీ ఎంపీడీవో జే సి హెచ్ చెన్నారావు కోరారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం మన రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నదని ఆయన తెలిపారు .అందులో భాగంగా యోగాంధ్ర అనే కార్యక్రమాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి గత నెల రోజులుగా విద్యాసంస్థలు, కార్యాలయాలు బహిరంగ ప్రదేశాలలో కూడా యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. సాధారణ ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థులు నిత్యం యోగాసనాలు వేస్తూ వారి శారీరక మానసిక ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు .అందువల్ల ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కొమరోలు మండలంలోని అన్ని విద్యాసంస్థలలో ,ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, తదితరు అన్ని ప్రాంతాలలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చాలని డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు కోరారు . మండలంలోని 13 గ్రామ సచివాలయాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించామని వారి పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని, ఆ కార్యక్రమాలకు ఆయా గ్రామాలలోని ప్రజా ప్రతినిధులను అధికారులు విద్యార్థులను ఉపాధ్యాయులను ఆహ్వానించాలని ఆయన కోరారు. ఇప్పటికే శిక్షణ పొందిన యోగా మాస్టర్లు యోగా కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలకు అధికారులకు సిబ్బందికి విద్యార్థులకు యోగాపై అవగాహన పెంచి వారితో యోగాసనాలు వేయించి అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయాలని ఆయన కోరారు. శనివారం ఉదయం 6:30 నుంచి 7:30 వరకు తప్పనిసరిగా యోగా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## ఘనంగా శివరాం జన్మదిన వేడుకలు




**కందుకూరు పెన్ పవర్, జూన్ 20**
కందుకూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శివరాం అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కందుకూరు పట్టణంలోని అన్న క్యాంటీన్ నందు 500 మందికి ఉచితంగా స్వీట్లు , భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , ప్రముఖ కాంట్రాక్టర్ రావూరి రామకోటయ్య , బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు , తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ , నెల్లూరు జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు చుండూరి శ్రీనివాసులు , కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ దివి శ్రీధర్ బాబు , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్, కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శులు దువ్వూరి రమేష్ చంద్ర , కందుకూరు పట్టణ బిసి సెల్ అధ్యక్షులు ముచ్చు వేణు , బెల్లం రామ్ లాల్, మధిర మధు, వేముల ప్రసాద్, ఉన్నం వీరస్వామి, మేడా మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ పి నెంబర్ ఆధారంగా భూమి నమోదు

**- లబ్ధి చేకూరని తల్లికి వందనం పథకం**

**సమస్య పరిష్కారం కొరకు సచివాలయం చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రులు**



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 20**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో ఒకటైన తల్లికి వందనం పథకం లబ్ధిదారుల జాబితా మరియు లబ్ధి చేకూరని జాబితాను మండల పరిధిలోని సచివాలయాల్లో ప్రదర్శించారు తల్లికి వందనం పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో ఆర్థిక సహాయం జమ చేశారు అనర్హత జాబితాలో పేర్లు నమోదు కావడంతో తల్లికి వందనం పథకం కింద లబ్ధి అందకపోవడంవల్ల పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ ఎల్ పి నెంబర్ ఆధారంగా భూమి ఎక్కువగా ఉన్నట్టు ఆన్లైన్లో నమోదు కావడంతో అనర్హత జాబితాలో పేర్లు నమోదు కావడంతో సచివాలయాల చుట్టూ సమస్య పరిష్కారం కొరకు అర్జీలు అందజేశారు ఈ సందర్భంగా కోవిలంపాడు గ్రామమునకు చెందిన అంగిరేకుల తిరుపతయ్య పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించగా ఎ"1.17 సెంట్లు మాత్రమే భూమి ఉన్నది కానీ ఎల్ పి నెంబర్ ఆధారంగా ఆన్లైన్లో భూమిని పరిశీలించగా ఎ"6.44 సెంట్లు భూమి ఉన్నట్లు ఆన్లైన్లో నమోదు కావడంతో అనర్హత జాబితాలో నమోదు కావడంతో లబ్ధి పొందేందుకు సచివాలయ కార్యాలయ సిబ్బందికి తమ కుటుంబానికి సంబంధించిన పట్టాదార్ పాసుబుక్ నకలు అందజేశారు తమ సమస్యను పరిష్కారం చేసి అర్హులుగా గుర్తించి తల్లికి వందనం పథకం కింద లబ్ధి అందేటట్లు చేయాలని కోరారు ఎల్పీ నెంబర్ తేడా వల్ల ఇలాగే చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం కింద లబ్ధి కోసం సచివాలయాల కార్యాలయాల్లో అర్జీలను అందజేసారు.

## ఎంవిఐగా అనిల్ కుమార్



**కందుకూరు పెన్ పవర్,జూన్ 20**
కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారి కార్యాలయము లో మోటారు వాహనముల తనిఖీ అధికారిగా జంగాల అనిల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మధ్య కాలంలో జరిగిన సాధారణ బదిలీల లో భాగంగా గుంటూరు జిల్లా ఎన్ఫోర్స్మెంట్ మోటారు వాహనముల తనిఖీ అధికారి గా పనిచేయుచున్న జంగాల అనిల్ కుమార్ ని కందుకూరు ఎం వి ఐ గా నియమితులయ్యారు. కందుకూరు నందు ఎం వి ఐగా పనిచేస్తున్న చెన్నూరి రాంబాబు ని ఇంతకముందు పనిచేస్తున్న నెల్లూరు జిల్లా ఎన్ఫోర్స్మెంట్ ఎం వి ఐ గా వెళ్ళటం జరిగినదని, కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖాధికారి టి.వి. నాగ లక్ష్మీ తెలియచేశారు.

## రామయ్య ఆకస్మిక మరణం విచారకరం

**మండల టిడిపి అధ్యక్షులు నార్నె రోశయ్య**

**కందుకూరు పెన్ పవర్, జూన్ 20**



ప్రకాశం విద్యాసంస్థల అధినేత, విద్యాదాత కంచర్ల రామయ్య ఆకస్మిక మరణం అత్యంత విచారకరం అని కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు నార్నె రోశయ్య అన్నారు. అక్షరాల వెలుగులు పంచడమే తన జీవిత లక్ష్యంగా జీవించిన ఆ మహనీయుడు, ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారు. ఆయన కేవలం ఒక విద్యాసంస్థల అధినేత కాదు, వేలాది మందికి స్ఫూర్తినిచ్చిన గురువు, ఆదర్శప్రాయుడు అని అన్నారు. కంచర్ల రామయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన స్థాపించిన విద్యాసంస్థలు, ఆయన నాటిన విద్యా బీజాలు నిరంతరం జ్ఞానాన్ని పంచుతూనే ఉంటాయి అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, ప్రకాశం విద్యాసంస్థల కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని రోశయ్య తెలియజేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం - ఎమ్మెల్యే ఏలూరి

**-మార్టూరులో పొగాకు నిల్వ గోడౌన్ల సందర్శన**
**-గ్రామాల్లో పొగాకు మండెలను పరిశీలన**
**-పూర్తిస్థాయిలో అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు**
**-బర్లీ పొగాకు రైతులతో ముచ్చటించిన ఎమ్మెల్యే ఏలూరి**
**-పర్చూరులో మార్కెట్ యార్డ్ లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సాంబన్న**
**-బర్లీ కొనుగోలు పై మార్క్ఫెడ్ డి ఎం తో సమీక్ష**

**రిపోర్టర్ మార్టూరు, పెన్ పవర్ జూన్ 20**

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులెవ్వరు అధైర్య పడొద్దని, ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలోని మార్టూరు, పర్చూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పొగాకు మండ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకును నిల్వ చేసేందుకు గోడౌన్ సౌకర్యం, సామర్థ్యాన్ని పరిశీలించారు. మార్టూరులో వ్యవసాయ మార్కెట్ గోడౌన్ సందర్శించారు. పొగాకు నిల్వ సామర్థ్యం,సౌకర్యాలను,భద్రతా చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులెవ్వరు అధైర్య పడవద్దని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రతి రైతు చివరి ఆకు వరకు మార్క్ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి తీరుతుందన్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని కొంత సమయమనం





పాటించాలన్నారు. ప్రతి రైతు పంట కొనుగోలు చేయడమే తమ ప్రభుత్వ కర్తవ్యం అన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ... అధికారుల ఆదేశాల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. పూర్తిస్థాయిలో అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు విస్తృత చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**కొనుగోలు కేంద్రం పరిశీలన, సమీక్ష...**

పర్చూర్ మార్కెట్ యార్డులో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సందర్శించారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అధికారులను రైతులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం రెండో రోజు కొనుగోలు ప్రక్రియ, పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోడౌన్ సౌకర్యం సామర్థ్యాన్ని తదితర అంశాలపై మార్క్ఫెడ్ డియం కరుణశ్రీ, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## కార్మికులా..కట్టు బానిసలా బాబూ తీరు మార్చుకో

**కార్మిక సంఘాల హెచ్చరిక**




**శ్రీకాళహస్తి పెన్ పవర్ ప్రతినిధి - జూన్ 20**

నాలుగు లేబర్ కోడ్లు..పది గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలంటూ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా చూస్తున్న సీఎం చంద్రబాబు తీరు మారకుంటే తగిన పర్యావసనాలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పది గంటల పని విధానం, నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి సంయుక్తంగా మాట్లాడుతూ కార్మికులు రక్తం చింధించి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాసేలా, కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచేలా నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల అణచివేత కారణంగానే గత జగన్ ప్రభుత్వం కుప్ప కూలిందనీ, ఆ తరహా విధానాలను అమలు చేస్తే కూటమి ప్రభుత్వానికి కార్మికులు ఘోరీ కడతారని హెచ్చరించారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెరగాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నిద్ర మేల్కొని పది గంటల పని విధానంపై పునరాలోచించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు గంధం మణి,వెంకటేష్,గురునాధం,ఏఐటీయుసి నాయకులు గోపి,మురళి, అయ్యప్ప, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా రెవెన్యూ డే

**కేక్ కట్ చేసిన తహశీల్దారు పి.శ్రావణ్ కుమార్.**
**ఉత్తమ పనితీరు కనబరిచిన రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత.**

**కావలి రూరల్ - పెన్ పవర్ జూన్ 20**

మనిషి జీవితంలో రెవెన్యూ శాఖదే ఘననీయమైన పాత్ర అని కావలి తహశీల్దారు పి శ్రావణ్ కుమార్ తెలిపారు. కావలి మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తహశీల్దారు శ్రావణ్ కుమార్ కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ పనితీరు కనబరిచిన రెవెన్యూ ఉద్యోగులకు తహశీల్దారు చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ మొదట శిస్తు వసూలుతో ప్రారంభమైన రెవెన్యూ వ్యవస్థ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనిషి దయనందిత జీవితంలో ప్రతి అంశంలోనూ రెవెన్యూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, మండల సర్వేయర్, ఆర్ ఐ, మరియు వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలోని 6475 ప్రదేశాలలో యోగా దినోత్సవం - జిల్లా కలెక్టర్ వెల్లడి

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 20**

జిల్లాలోని 6475 ప్రదేశాలలో ఈనెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు ఏర్పాట్లపై జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల ముందస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు చేసుకునే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లందరికీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారన్నారు. ఆ ప్రకారం జిల్లాలోని 6475 ప్రదేశాలలో ఈనెల 21వ తేదీన ప్రభుత్వం నిర్దేశించిన యోగా ప్రోటోకాల్ ను నిర్వహించాలన్నారు. 6475 ప్రదేశాల్లో సామర్థ్యానికి తగ్గ విధంగా మొబిలైజేషన్ చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్దేశించిన ప్రదేశంలో యోగా కార్యక్రమం తప్పనిసరిగా జరగాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న పౌరులందరూ పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. గుర్తించిన యోగ నిర్వహణ ప్రదేశాల వద్ద ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేపట్టాలన్నారు. యోగా కార్యక్రమం నిర్వహించిన తర్వాత అందుకు సంబంధించిన ఫోటోలను కచితంగా అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో కంట్రోలు రూమ్ లను ఏర్పాటుచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో యోగ కార్యక్రమం ఒంగోలు మినీ స్టేడియంలో ఉదయం 7గంటల నుండి 8 గంటల వరకు



కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు, సీనియర్ సిటిజెన్లు, విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరు పాల్గొన విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాల జారీ చేశారు. అన్ని ప్రదేశాల్లో నిర్దేశించిన సమయంలో యోగ కార్యక్రమం ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మండల అధికారులు వారి వారి మండల పరిధిలో యోగ కార్యక్రమాలను పర్యవేక్షణ నిర్వహించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు.

## ఘనంగా రెవెన్యూ దినోత్సవం







**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 20**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెవెన్యూ దినోత్సవాన్ని మార్కాపురం రెవెన్యూ డివిజన్లో ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ బి. సహోదిత్ వెంకట త్రివినాగ్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ గడియార స్థంభం వరకు కొనసాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సేవ అంటే రైతులకు సేవ అనే నినాదంతో, శ్లోకాలతో కూడిన ప్లకార్డులు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఉద్యోగుల సన్మానం, పుస్తక ప్రదర్శనలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజల్లో రెవెన్యూ వ్యవస్థపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

## రామయ్య కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్ - జూన్ 20**

కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శనివారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య భౌతిక ఖాయాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకాంత్ ను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరివీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ షర్మిల రెడ్డి సభను జయప్రదం చేయండి

**-డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు**



**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జూన్ 20**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి గారు జిల్లాల పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి జూన్ 23వ తారీకు సోమవారం నాడు మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఫంక్షన్ హాల్ నందు జరుగు జిల్లా సమీక్ష సమావేశమునకు హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, ఉపాధ్యక్షులు శబరి రాజన్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, కోశాధికారి వేలు, , శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు చెరుకు తోట రాహుల్, ఆంటోనీ,శ్రీకాళహస్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, ఆసిఫ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం. దారు నాయక్.



**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జూన్ 20**

శ్రీకాళహస్తీశ్వర జ్ఞాన ప్రసూనాంబిక దేవస్థానమునకు దర్శనానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు మరియు రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఎం దారు నాయక్ కి ఘన స్వాగతం పలికిన శ్రీకాళహస్తి దేవస్థానం ఏఈఓ మోహన్ మరియు శ్రీకాళహస్తి దేవస్థానం పిఆర్ఓ రవి మరియు తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ ఎం సుబ్బయ్య మరియు శ్రీకాళహస్తిని ఎస్టీ సెల్ అధ్యక్షుడు వెర్రి. రమేష్ మరియు శ్రీకాళహస్తి పట్టణ ఎస్టీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి రామయ్య ఎస్టి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగినది.

## యోగాంధ్ర నిర్వహణకు సర్వం సిద్ధం.

**కావలి మండలంలో 144 ప్రాంతాల్లో యోగాంధ్ర నిర్వహణ**
**-ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి**

**కావలి పెన్ పవర్ - జూన్ 20**

ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో శనివారం కావలి మండలంలో నిర్వహించే యోగేంద్ర కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు కావలి ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ కావలి మండలంలో 144 ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతంలో శిక్షకులు యోగ పై అవగాహన కల్పిస్తారన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో యోగేంద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.





# టికెట్ లేకున్నా అంతరాలయం దర్శనం..!



**శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీల దందా..!**
**ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందితో కుమ్మకు.!**
**ప్రోటోకాల్ పేరుతో తమ వారికి పిఆర్వో కార్యాలయ సిబ్బంది దర్శన ఏర్పాట్లు.!**

**శ్రీ కాళహస్తి – పెన్ పవర్, జూన్ 20.**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందాను అరికట్టడానికి కూటమి ప్రభుత్వం రూ 500 టికెట్ పేరుతో అంతరాలయ దర్శన టిక్కెట్టును ప్రవేశపెట్టింది.. ఈ టికెట్ కొనుగోలు చేసిన వారిని మాత్రమే స్వామి అమ్మ వార్ల ఆలయంలో అంతరాలయ దర్శనానికి అనుమతించాల్సి ఉంటుంది. కానీ ఆలయంలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. కొందరు సిబ్బందితో కుమ్మక్కైన దళారులు టికెట్ లేకపోయినా దర్జాగా అంతరాలయ దర్శనాలు చేయిస్తూ తమ పబ్బం గడుపుతున్నారు. దక్షిణ కైలాసంగా, రాహు కేతువుల నిలయంగా విరాజిల్లుతున్న శ్రీ కాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లని దర్శించుకొనేందుకు రాష్టం నుంచే కాకా దేశ విదేశాల నుంచి వేలమంది భక్తులు వస్తుంటారు.. వీరిలో ఎక్కువ మంది తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ నుంచి వస్తున్నారు.. వచ్చే వారిలో చాలామంది దాదాపు రాహుకేతు పూజలు చేసుకొంటుంటారు.. వారాంతం, సెలవు రోజులలో యాబై వేల మంది వరకు భక్తులు స్వామి వారి దర్శనార్థం విచ్చేస్తారు. సామాన్య భక్తుల కోసం ఆలయంలో ఉచిత దర్శనం క్యూలైన్లు ఉన్నాయి. అలాగే రూ.. 50, రూ. 200 రూపాయల టిక్కెట్ల క్యూ లైన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఉచిత మరియు 50 రూపాయల దర్శనం క్యూ లైన్లు ఆలయంలోని రంగుల గోపురం వద్ద నుంచి మొదలవుతాయి. అలాగే 200 టికెట్ క్యూ లైన్ పదహారు కాళ్ల మండపం నుంచి దర్శనం కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల్లో భాగంగా ఈవో టి. బాపిరెడ్డి బాధ్యతలు తీసుకొన్న వెంటనే రూ.500 500 టికెట్ తో ఒక్కరికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం అవకాశం కల్పించారు.. టికెట్ ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే వందలాది మంది ఈ టికెట్ కొనుగోలు చేసి స్వామి అమ్మవార్లని తనివితీరా దర్శించుకొంటున్నారు. అంతేకాకుండా ఆలయానికి కూడా ఆదాయం గణనీయంగా పెరిగింది. రద్దీ రోజుల్లో ఎక్కువ మంది భక్తులు ఈ టికెట్ కొనుగోలు చేస్తున్నారు.

**ఆగని దందా...**

కొంతమంది దేవస్థానం ఉద్యోగులు, భద్రతా, పిఆర్వో కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందితో కుమ్మక్కైనా దళారీలు భక్తులను అంతరాలయం పేరుతో రెండు వందల రుపాయల టిక్కెట్లను కొనుగోలు చేసి రూ 500 వందల టికెట్ పేరుతో బురిడి కొట్టిస్తున్నారు..ముందుగా అనుకొన్న ప్రకారం రూ 200 టికెట్ తోనే దర్జాగా అంతరాలయ దర్శనం కూడా చేసుకొంటున్నారు. భక్తుల నుంచి భారీగా వసూలు చేసుకొని అందరూ దర్జాగా పంచుకొంటున్నారు.. ఫలితంగా ఆలయానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోతోంది. అంతేకాకుండా రూ 500 టికెట్ కొనుగోలు చేయకపోయినా దర్జాగా అంతరాలయ దర్శనాలు జరిగిపోతున్నాయి. నిజంగా టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఇదేమి చోద్యం అని ఆవేదన చెందుతున్నారు. ఇక పిఆర్వో కార్యాలయ సిబ్బంది గురించి ఎంత చెప్పిన తక్కువే ప్రోటోకాల్ పేరుతో వారికి కావాల్సిన వారికి ప్రోటోకాల్ దర్శనాలు చేయించుకొంటూ తమ జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ఆలయ ఈవో, ఉన్నతాధికారులు రూ 500 టికెట్ కొనుగోలు చేసిన వారిని మాత్రమే ఆలయంలో అంతరాలయ దర్శనానికి అనుమతించాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.. అలాగే అక్రమాలకు పాల్పడే వారిపైన కెమెరాల ద్వారా పరిశీలన చేసిన కఠిన చర్యలు తీసుకొంటే తప్పులు పునరావృతం అయ్యే పరిస్థితి ఉండదు.

పెన్ పవర్
నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

# తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు భేష్

**తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు**





**కావలి పెన్ పవర్ – జూన్ 20**

తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అపూర్వమని కావలి పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు ప్రశంచించారు. శుక్రవారం ఆయన కావలి రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా బాధిత చిన్నారులను, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన తలసేమియా కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ టి రమ్యలతో సమావేశమయ్యి, కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తలసేమియా, సికిల్ సెల్, హేమోఫిలియా బాధితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రక్తమార్పిడి, మందులు, పౌష్టిక ఆహారం దాతల సహకారంతో ఉచితంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మహోన్నత సేవకార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గౌరవ శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఈ కేంద్రం సేవలు విస్తృతమౌతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రక్తమార్పిడి చేయించుకున్న చిన్నారులకు మందులు, పౌష్టిక ఆహారం అందించారు.

**తలసేమియా ఆసుపత్రి నిర్వహణకు విరాళం అందించిన విశ్రాంత విద్యుత్ శాఖ ఏడిఇ**

విశ్రాంత విద్యుత్ శాఖ ఏడిఇ యం మధుసూదనరావు తలసేమియా డే కేర్ సెంటర్ లో చికిత్స పొందుతున్న చిన్నారుల మందులు, పౌష్టిక ఆహారవితరణకు 10 వేల రూపాయల విరాళం వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, కార్యదర్శి బి యస్ ప్రసాద్, ఆర్థిక కమిటీ సభ్యులు పి కొండలరావు, తలసేమియా కమిటీ సభ్యులు కల్లయ్య, సిబ్బంది శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా శ్రీకాళహస్తిలో జనసేన నాయకుల సంబరాలు





**శ్రీ కాళహస్తి – పెన్ పవర్, జూన్ 20.**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం లోని జిల్లా కార్యాలయంలో జనసేన కార్యకర్తలు మరియు వీర మహిళల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొట్టె సాయి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ చెయ్యని విధంగా తన కష్టార్జితం అయిన 9.6 కోట్ల రూపాయల ప్రజల కోసం ఇచ్చిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, తాను ఎంచుకున్న పంచాయతీ రాజ్ శాఖకు న్యాయం చేస్తూ కేంద్రం నుండీ వచ్చే నిధులు నేరుగా పంచాయితీలకు అందించి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులు పక్కదారి పట్టించే పరిస్థితి ప్రజలందరూ గమనించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఏ పార్టీ సర్పంచ్ లు ఉన్నా ప్రతి పంచాయతీకి సమానంగా నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి దోహదం చేస్తూనే సర్పంచ్, ఎంపీటీసి లను తలెత్తుకునేలా చేసిన ఘనత పవన్ కళ్యాణ్ కు దక్కుతుందని అన్నారు. అటవీశాఖ మంత్రిగా ఎవరూ చూపనంత చొరవ చూపి ఆంధ్ర రాష్ట్రంలో పలుచోట్ల ఏనుగులు వలన ప్రజలకు ప్రాణనష్టం, ఆస్తి,పంట నష్టం కలుగజేస్తున్న సందర్భంలో కర్ణాటక రాష్ట్రాన్ని ఒప్పించి కుంకి ఏనుగులు మన రాష్ట్రానికి తెచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ ది అని కొనియాడారు. జనసేన పార్టీ నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించి భారత దేశ చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించిందన్నారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి గా సంబంధిత శాఖలకు వన్నె తెచ్చేలా పరిపాలన అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో గరికపాటి చంద్రశేఖర్, ఇర్ల చిరంజీవి,ఢిల్లీ బాబు, బద్రి, పగడాల ప్రతాప్, అరిగెల వేణు, వీర మహిళ కవిత, పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, మహేష్, ముని చంద్ర, ముని కుమార్, రమేష్ బాబు, వెంకటేష్ మరియు ఇతర కార్యకర్తలు

# ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండల కమిటీ అబ్జర్వర్‌గా మన్నవ రవిచంద్ర

**రవిచంద్రను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కాకర్ల**



**కావలి పెన్ పవర్ జూన్ 20**

జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మన్నవరం రవిచంద్రను అధిష్టానం ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండల కమిటీ అబ్జర్వర్ గా నియమించారు. ఉదయగిరి ఇంజమూరు మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కార్యక్రమం నికి హాజరైన మన్నవ రవిచంద్రను ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం మన్నవ రవిచంద్ర కూడా ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి నియమ నిబద్ధత క్రమశిక్షణ కలిగిన ఏకైక వ్యక్తి మన్నవ రవిచంద్ర అని తను కావలి నియోజకవర్గం లో కరోనా కష్టకాలములో నిరాశ్రయము లేని వారికి ఆశ్రయము కల్పించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రస్తుత ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అభినందనలు పొందిన వ్యక్తిని సగర్భంగా తెలిపారు. అనంతరం కార్యకర్తల హర్షధ్వనాల చేశారు. అనంతరం అనంతరం మన్నవ రవిచంద్ర మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు నన్ను అబ్జర్వర్ గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అలాగే నాకు సహకరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్లకు మరియు బీద రవిచంద్ర కు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









# ఆ ముగ్గురు క్రికెట్ దిగ్గజాలకు ప్రత్యేకం.. కొత్త కుర్రాడికీ?




ఆ ముగ్గురు భారత దిగ్గజ క్రికెటర్లు.. ముగ్గురూ కెప్టెన్లుగా పనిచేశారు.. ముగ్గురూ ఏదో ఒక ఫార్మాట్ లో పదివేలకు పైగా పరుగులు చేశారు.. ముగ్గురూ ఒకే రోజు అంతర్జాతీయ టెస్టు క్రికెట్ లో అడుగుపెట్టారు.. అది కూడా జూన్ 20నే కావడం విశేషం. మరి ఇదే రోజు టీమ్ ఇండియా తరఫున మరో క్రికెటర్ కూడా టెస్టు ఎంట్రీ ఇచ్చాడు. మరి ఆ దిగ్గజాల స్థాయిలోనే ఇతడూ ఎదుగుతాడని అభిమానులు భావిస్తున్నారు.

అది 1996.. అప్పటికి టి20లు పుట్టలేదు. టీమ్ ఇండియా చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ సమయంలో ఇద్దరు కుర్రాళ్లు టెస్టు జట్టులోకి వచ్చారు. జూన్ 20న ఇంగ్లండ్ తో ప్రఖ్యాత లార్డ్స్ లో తొలి టెస్టు ఆడారు. వారే కోల్ కతా ప్రిన్స్ సౌరభ్ గంగూలీ, కర్ణాటక ది గ్రేట్ వాల్ రాహుల్ ద్రవిడ్. విచిత్రం ఏమంటే ఈ మ్యాచ్ లో వన్ డౌన్ లో వచ్చిన సౌరభ్ గంగూలీ 131 పరుగులు చేశాడు. తొలి టెస్టులోనే, అదీ లార్డ్స్ లో సెంచరీ కొట్టాడు. ఏడో స్థానంలో దిగిన రాహుల్ ద్రవిడ్ 95 పరుగుల వద్ద ఔటై సెంచరీని చేజార్చుకున్నాడు. ఆ తర్వాతి కాలంలో వీరిద్దరూ తిరుగులేని క్రికెటర్లు అయ్యారు. కెప్టెన్లుగానూ వ్యహరించారు. వన్డేల్లో 10 వేల పరుగులు సాధించారు. టెస్టుల్లో ద్రవిడ్ 13,288 పరుగులతో దిగ్గజంగా ఎదిగాడు. గంగూలీ 7,212 పరుగులు సాధించాడు.జూన్ 20నే అంతర్జాతీయ టెస్టు క్రికెట్ లోకి వచ్చాడు మరో దిగ్గజ విరాట్ కోహ్లి. వన్డేల్లోకి 2008లోనే ఎంట్రీ ఇచ్చినా.. టెస్టుల్లోకి రావడానికి మూడేళ్ల పట్టింది. 2011లో జరిగిన వెస్టిండీస్ టూర్ లో తొలి టెస్టు ఆడాడు. తొలి ఇన్నింగ్స్ లో 4, రెండో ఇన్నింగ్స్ లో 15 పరుగులు మాత్రమే చేశాడు. కానీ, ఆ తర్వాత గొప్ప బ్యాట్స్ మన్ గా ఎదిగాడు. టెస్టుల్లో 9,230 పరుగులు సాధించాడు. ఇటీవలే రిటైర్మెంట్ ఇచ్చాడు.పైన చెప్పుకొన్న ముగ్గురిలాగానే జూన్ 20న అంతర్జాతీయ టెస్టు క్రికెట్ లోకి అడుగుపెట్టాడు తమిళనాడుకు చెందిన సాయి సుదర్శన్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అదరగొట్టిన ఎడమ చేతివాటం బ్యాటర్ సాయి.. ఇంగ్లండ్ పై టెస్టు అరంగేట్రం చేశాడు. మంచి టెక్నిక్, ఓపికగా ఆడే సాయి సుదర్శన్.. భవిష్యత్ లో గొప్ప బ్యాటర్ గా ఎదుగుతాడని భావిస్తున్నారు. అదీ.. జూన్ 20కి.. నలుగురు టీమ్ ఇండియా క్రికెటర్లకు ఉన్న సంబంధం.

# ఇద్దరు సీఎంలు-ఒక ప్రాజెక్టు-కూర్చుంటే పోలా!!



రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల్లో కీలకమైన ఘట్టానికి కేంద్రం ఎలాంటి ముగింపు ఇస్తుంది? ఎలాంటి దశ-దిశ చూపిస్తుంది? అనేది ఆసక్తికరం. తాజాగా తెరమీదికి వచ్చిన బనకచర్ల ప్రాజెక్టు కావొచ్చు. గతంలోనే ఉన్న సాగర్, శ్రీశైలం తగువులు కావొచ్చు.. వేటినైనా కేంద్రం పరిష్కరించిం దా? అంటే.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చోటు చేసుకున్న ఇలాంటి వివాదాలను కేంద్రం ఎప్పుడూ రాజకీయ కోణంలోనే చూసిందన్నది వాస్తవం. "తెలంగాణలో అయినా.. ఏపీలో అయినా.. రాజకీయ ప్రయోజనాలు లేకుండా అడుగులు వేయడం కష్టం " అంటూ.. నిరుడు కేసీఆర్ హయాంలోనే కేంద్రం స్పష్టం చేసింది. నాడు జగన్ ప్రభుత్వం ఏపీలో తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం అయినా.. నేడు బనకచర్ల ప్రాజెక్టు అయినా.. స్వరూపం.. సాధ్యాసాధ్యాలు కూడా ఒక్కటే. వృథాగా పోతున్న గోదావరి జలాలను.. ఒడిసి పట్టి.. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు పారించడమే. వృథాగా పోయే నీటి విషయం అయితే.. ఎందుకు ఇంత యాగీ ఉంటుందన్నది మరోప్రశ్న. వృథాగా పోయే నీటిని తీసుకుంటే.. ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ.. ఏడాదిలో మూడు నుంచి 4 మాసాల వరకు మాత్రమే నీటి వృథా మనకు కనిపిస్తుంది. కానీ, ఇతర మాసాల్లోకి వచ్చేసరికి.. గోదావరి జలాలు ఆశించిన మేరకు కూడా ఉండడం లేదు. ఇదే అసలు చిక్కు. ఈ విషయమే అసలు వివాదానికి కారణం. "నీరు ఉన్నప్పుడు తీసుకుంటే తప్పులేదు. కానీ, లేనప్పుడు కూడా లాగేస్తారు" అనేదే తెలంగాణ వాదన. పైగా.. దిగువ రాష్ట్రంగా ఉన్న ఏపీ ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఇప్పుడు ఎలా ఉన్నా.. రేపు నీటి వాటాల విషయంలో రగడలు, పంతాలకు పోయే అవకాశం ఉందని తెలంగాణ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే నాడు కేసీఆర్ కూడా రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అడ్డుపడ్డారు. నేడు బనకచర్ల వ్యవహారం తెరమీదికి వచ్చింది.ఏపీకి గేమ్ ఛేంజర్ అంటూ.. చంద్రబాబు ప్రచారం చేసుకున్నా.. తెలంగాణకు ఇది ఉరి తాడవుతుందన్న అక్కడి నేతల ప్రచారం కూడా చర్చనీయాంశమే. దీంతో ఒక్కసారి ఇరు రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకుంటే సమస్యకు ఒక పరిష్కారం దక్కే అవకాశం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు. కూర్చుని చర్చించుకుంటే తప్పులే దని.. ఎవరికి ఉన్న సందేహాలను వారు తెలుసుకునేందుకు, పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇది చంద్రబాబు ప్రకటించిన ఓపెన్ ఆఫరే అయినా.. తెలంగాణ ఏమేరకు ముందుకు వస్తుందన్నది చూడాలి.

# 'నీ తల ఎందుకు తీయకూడదు' జగన్ పై బుచ్చయ్య చౌదరి ఫైర్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై టీడీపీ మాటల దాడి కొనసాగిస్తోంది. రెండు రోజుల క్రితం పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనకు వెళ్లిన మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు.. ఆ పర్యటన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు ప్రదర్శించిన పోస్టర్లపై అధికార పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా తాము 2029లో అధికారంలోకి వస్తే 'రప్పా.. రప్పా.. నరికేస్తాం' అనే పోస్టరు అత్యంత వివాదాస్పదమైన విషయం తెలిసిందే. గురువారం మీడియాతో మాట్లాడిన మాజీ సీఎం జగన్ దృష్టికి ఈ విషయాన్ని మీడియా తీసుకువెళ్లగా, పుష్పా సినిమాలో డైలాగ్ చెప్పడం కూడా తప్పేనా? అంటూ విషయాన్ని తేలిక చేసే ప్రయత్నం చేశారు. అయితే జగన్ స్పందనపైనా అధికార పార్టీ అసహనం వ్యక్తం చేస్తోంది.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ వంటి వారు మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలను తప్పుపట్టగా, టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ఘాటుగా స్పందిస్తున్నారు.

# చంద్రబాబు తలచుకుంటే జగన్ రెండు నిమిషాల్లో జైల్లో ఉంటారు

- మొదటి పేజి తరువాయి

తమను గెలిపించింది పరిపాలించడానికి, సంక్షేమం, అభివృద్ధి చేయడానికి తప్పితే కక్షసాధింపులతో ఎవరినో జైల్లో పెట్టడానికి కాదని స్పష్టం చేశారు. అయితే, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, సాక్ష్యాధారాల ప్రకారమే ముందుకు వెళ్తామని హెచ్చరించారు. మద్యం కేసులో త్వరలో చార్జిషీట్ దాఖలు చేస్తారని, మనీలాండరింగ్ ఆరోపణలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొనడం జగన్ ప్రభుత్వ హయాంలోని వ్యవహారాలపై దర్యాప్తు ముమ్మరం కానుందనడానికి సంకేతంగా కనిపిస్తోంది.

**కక్ష సాధింపులు లేవు.. కానీ చట్టం నుంచి తప్పించుకోలేరు**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు చేపట్టదని లోకేశ్ పునరుద్ఘాటించారు. "మమ్మల్ని ప్రజలు గెలిపించింది రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడానికి. అంతేకానీ, కక్ష సాధింపులతో సమయం వృథా చేసుకోం" అని అన్నారు. అయితే, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను, చట్ట ఉల్లంఘనలను మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. "చట్టం తనపని తాను చేస్తుంది. సాక్ష్యాధారాలు ఉంటే ఎవరైనా చట్టం ముందు సమానులే" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**ప్రధానితో భేటీ - యువతకు దిశానిర్దేశం**

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీ గురించి లోకేశ్ తొలిసారి ప్రస్తావించారు. ఆ భేటీని 'అన్‌బిలీవబుల్'గా అభివర్ణించారు. మోదీ తన 25 ఏళ్ల రాజకీయ జీవితానుభవాలను తనతో పంచుకున్నారని తెలిపారు. "నాన్న నీడ నుంచి బయటకురా, కష్టపడు. భవిష్యత్తు యువకులదే, కష్టపడి ఎదగాలి" అని మోదీ తనకు సూచించినట్టు లోకేశ్ పేర్కొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధి.. సంక్షేమానికి ప్రాధాన్యం**

గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన అభివృద్ధిని తిరిగి గాడిలో పెడతామని లోకేశ్ స్పష్టం చేశారు. "తల్లికి వందనం కార్యక్రమం దాదాపు 95 శాతం పూర్తయింది. జులై 5 కల్లా మిగిలిన సమస్యలు పరిష్కరించి 100 శాతం పూర్తి చేస్తాం. సూపర్‌సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తాం" అని వివరించారు. జులై చివరి నాటికి విశాఖలో టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, అదే రోజు శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు రూ. 2000 కోట్లు క్లియర్ చేశామని, కార్యకర్తలపై గత ప్రభుత్వంలో పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజు ఎంతో దూరం లేదు

**పెన్ పవర్ డెస్క్:**ఆంగ్ల భాషను వలసవాద బానిసత్వానికి ప్రతీకగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అభివర్ణించారు. భవిష్యత్తులో ఇంగ్లీష్ మాట్లాడేవారే సిగ్గుపడే పరిస్థితి వస్తుందని, ప్రజలే ఆ భాషను తిరస్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. భారతీయ సంస్కృతి, వారసత్వాలకు స్థానిక భాషలే నిజమైన గుర్తింపునిస్తాయని, విదేశీ భాషల స్థానాన్ని అవి భర్తీ చేయాలని ఆకాంక్షించారు.

నిన్న ఢిల్లీలో ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి హిందీలో రచించిన 'మై బూంద్ హూ.. ఖుద్ సాగర్ హూ' (నేను నీటి బిందువునే కాదు.. సముద్రాన్ని కూడా) అనే పుస్తకావిష్కరణ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి, సంస్కృతికి, చరిత్రకు, మతానికి సంబంధించిన విషయాలను అర్థం చేసుకోవడానికి ఏ విదేశీ భాష సరిపోదని అన్నారు. అసంపూర్ణమైన విదేశీ భాషలతో 'సంపూర్ణ భారతం' అనే భావనను ఊహించలేమని ఆయన స్పష్టం చేశారు.

స్థానిక భారతీయ భాషలే దేశ ఉనికికి కీలకమని నొక్కిచెప్పిన అమిత్ షా, ఆంగ్లం మాట్లాడే వారు త్వరలోనే ఇబ్బందిపడే సమాజం ఏర్పడుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆంగ్లాన్ని వలసవాద బానిసత్వపు గుర్తుగా భావించి, దాన్ని వదిలించుకుంటారని ఆయన జోస్యం చెప్పారు.

కాగా, హిందీని బలవంతంగా రుద్దడాన్ని, నూతన విద్యావిధానంలో భాగంగా ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని (స్థానిక భాష, ఆంగ్లం, హిందీ) తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం సహా కొన్ని విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## ఆంగ్ల భాషపై అమిత్ షా వ్యాఖ్యలు.. స్పందించిన రాహుల్ గాంధీ

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రపంచ వేదికపై పోటీ పడాలనుకునే ప్రతి విద్యార్థికి ఆంగ్ల పరిజ్ఞానం ఎంతో కీలకమని, ఇది వారి సాధికారతకు చిహ్నమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ విధంగా స్పందించారు.ఆంగ్ల భాష నేర్చుకోవడం సిగ్గుపడాల్సిన విషయం కాదని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, మెరుగైన ఉపాధి అవకాశాలను కూడా ఆంగ్ల భాష కల్పిస్తుందని ఆయన తెలిపారు. మాతృభాషకు ఎంత ప్రాధాన్యత ఉందో, ప్రస్తుత ప్రపంచంలో రాణించడానికి ఆంగ్లానికి కూడా అంతే ప్రాముఖ్యత ఉందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థికి మాతృభాషతో పాటు ఆంగ్లంలో కూడా తర్ఫీదు ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, సమాజంలో సమానత్వాన్ని సాధించడం ఆ రెండు సంస్థలకు ఇష్టం లేదని ఆయన ఆరోపించారు. అందుకే వారు విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

దేశంలోని ప్రతి భాషకు దాని సొంత ఆత్మ, సంస్కృతి, జ్ఞాన సంపద ఉన్నాయని, వాటన్నింటినీ మనం గౌరవించాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే, అదే సమయంలో ప్రపంచంతో సమర్థవంతంగా పోటీ పడేందుకు వీలుగా ఆంగ్ల విద్యను కూడా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.ఒక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు. మన దేశాన్ని, సంస్కృతిని, మతాన్ని అర్థం చేసుకోవడానికి ఏ పరాయి భాషా సరిపోదని, విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు.

## అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే... అది మర్చిపోవద్దు

- మొదటి పేజి తరువాయి

పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం

- మొదటి పేజి తరువాయి

యోగా పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. "యోగాను నిత్యం ఆచరిద్దాం. మన జీవన విధానంలో అంతర్భాగంగా మార్చుకుందాం. విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నుంచే దీనికి నాంది పలుకుదాం" అని ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి అన్నారు. యోగా సాధన ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

"ప్రధాని నరేంద్ర మోదీ గారి సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్ లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. అలాగే రాష్ట్రంలో వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం" అని ఆయన దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వారసత్వంగా మనకు అందిన ఈ యోగా విద్యను మనమంతా ఆచరించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# జగన్ పర్యటన సందర్భంగా మృతి చెందిన సింగయ్య కుటుంబానికి రూ. 10 లక్షల చెక్ అందించిన అంబటి

- మొదటి పేజి తరువాయి

అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు వెంగళాయపాలెంలోని సింగయ్య నివాసానికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా, పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించిన రూ. 10 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సింగయ్య భార్యకు అందజేశారు.

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ, "సింగయ్య వైసీపీ కార్యకర్త, జగన్ అభిమాని. జగన్ పర్యటనలో కారు ప్రమాదం కారణంగా ఆయన మరణించడం బాధాకరం. ఈ విషయం తెలిసిన వెంటనే జగన్ స్పందించి, సింగయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆ చెక్కును ఆయన భార్యకు అందించాం. పార్టీ అన్ని విధాలా ఆ కుటుంబానికి అండగా ఉంటుంది" అని తెలిపారు.

సింగయ్య మృతిని కూడా కూటమి ప్రభుత్వం రాజకీయం చేయాలని చూసిందని అంబటి మండిపడ్డారు. "జగన్ పర్యటనలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్ని కేసులు పెట్టినా మేం భయపడం, వాటిపై న్యాయపోరాటం చేస్తాం. అయితే, మా పార్టీ నాయకులను గానీ, కార్యకర్తలను గానీ పోలీసులు అన్యాయంగా నిర్బంధిస్తే చూస్తూ ఊరుకోబోం" అని హెచ్చరించారు. వైఎస్ జగన్ పర్యటనకు ప్రజలు రాకుండా అడ్డుకోవాలని ప్రభుత్వం పోలీసుల ద్వారా కుట్ర పన్నిందని, అయినప్పటికీ వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని ఆయన పేర్కొన్నారు.

# 'యోగాంధ్ర'తో ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది...

- మొదటి పేజి తరువాయి

ప్రధాని మోదీ అభినందించారు. ఏపీ నేతల సమష్టి కృషి, పనితీరు అద్భుతంగా ఉన్నాయని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

అంతకుముందు, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.విమానాశ్రయం నుంచి ప్రధాని నేరుగా ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి నౌకాదళ అతిథిగృహానికి వెళ్లారు. ఈ రాత్రి ఆయన అక్కడే బస చేస్తారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించే భారీ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని యోగాసనాలు వేయనున్నారు. కార్యక్రమాలు ముగిసిన అనంతరం, ఉదయం 11:50 గంటలకు ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## విశాఖలో గవర్నర్‌తో మంత్రి లోకేశ్ భేటీ... 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, మంగళగిరి శాలువాతో సత్కరించారు. అనంతరం, తన యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన పుస్తకాన్ని మంత్రి లోకేశ్ గవర్నర్ నజీర్‌కు అందజేశారు.శనివారం (జూన్ 21) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో 'యోగాంధ్ర' పేరిట భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచ రికార్డు లక్ష్యంగా సుమారు 5 లక్షల మందితో ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా పాల్గొంటున్న నేపథ్యంలో, 'యోగాంధ్ర'పై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది. ప్రధాని వస్తుండడంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యత చేకూరింది. ఈ బృహత్తర కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విశాఖ నగరం ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

# 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్... వందలమంది మృతి

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య ఈ ఘర్షణ వాతావరణం రెండో వారంలోకి ప్రవేశించింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ మొదటి నుంచి వాదిస్తోంది. అయితే, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, యూరోపియన్ దేశాలు దౌత్య మార్గాల ద్వారా ఇరాన్‌ను శాంతియుత చర్చలకు తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ విషయంలో తమ దేశం జోక్యంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటామని సంకేతాలిచ్చారు.

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) వెల్లడించిన వివరాల ప్రకారం, 60కి పైగా యుద్ధ విమానాలు, సుమారు 120 శక్తివంతమైన ఆయుధాలతో ఈ దాడులు జరిగాయి. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లోని పలు క్షిపణి తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నారు. వీటిని ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కీలక పారిశ్రామిక ప్రాంతాలుగా ఐడీఎఫ్ అభివర్ణించింది. క్షిపణి విడిభాగాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడులు కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనాన్ని ఈ ఆపరేషన్‌లో విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

"క్షిపణి విడిభాగాల ఉత్పత్తికి సంబంధించిన సైనిక పారిశ్రామిక ప్రాంతాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి వాడే ముడిపదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడి చేశాం. ఇరాన్ అణ్వాయుధ ప్రాజెక్టును దెబ్బతీసే చర్యల్లో భాగంగా, టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనంపై కూడా దాడి చేయడం జరిగింది" అని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎస్పీఎన్‌డీ సంస్థ ఇరాన్ సైనిక సామర్థ్యానికి అవసరమైన అధునాతన సాంకేతికతలు, ఆయుధాల పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమ రూపశిల్పిగా పేరుగాంచిన ఫఖ్రి జాదే 2011లో ఈ సంస్థను స్థాపించారు. తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముసురుకుంది.

# భారత్ దెబ్బకు విలవిల... ఒప్పుకున్న పాకిస్థాన్ ఉప ప్రధాని

- మొదటి పేజి తరువాయి

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా రావల్పిండి, పంజాబ్ ప్రావిన్స్‌లోని తమ రెండు కీలక వైమానిక స్థావరాలపై దాడులు జరిగాయని ఆయన అంగీకరించారు. ఈ దాడుల తీవ్రతతోనే అమెరికా, సౌదీ అరేబియా జోక్యం కోరి కాల్పుల విరమణకు సిద్ధపడ్డామని ఒక టీవీ న్యూస్ షోలో దార్ బహిరంగంగా వెల్లడించారు.పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ, "దురదృష్టవశాత్తూ, తెల్లవారుజామున 2:30 గంటలకు భారత్ మరోసారి క్షిపణి దాడులు చేసింది. రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్, పంజాబ్ ప్రావిన్స్‌లోని షోర్‌కోట్ ఎయిర్‌బేస్ (పీఏఎఫ్ బేస్ రఫీకిగా ప్రసిద్ధి) లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ ఘటన జరిగిన 45 నిమిషాల్లోనే సౌదీ యువరాజు ఫైసల్ నాకు ఫోన్ చేశారు. అప్పటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో నేను జరిపిన సంభాషణ గురించి ఆయనకు తెలిసిందని చెప్పారు. భారత్ దాడులు ఆపితే, పాక్ కూడా ఆపడానికి సిద్ధంగా ఉందని భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు తెలియజేయడానికి తనకు అధికారం ఉందా అని అడిగారు. నేను సరే సోదరా, మీరు మాట్లాడవచ్చు అని చెప్పాను.

ఆ తర్వాత ఆయన మళ్లీ ఫోన్ చేసి, జైశంకర్‌కు ఈ విషయం తెలియజేశానని చెప్పారు" అని వివరించారు.నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ పాకిస్థాన్ అత్యంత కీలకమైన సైనిక స్థావరాల్లో ఒకటి. ఇక్కడ వాయుసేన కార్యకలాపాలతో పాటు వీఐపీ రవాణా యూనిట్లు కూడా ఉన్నాయి. ఇది రావల్పిండి, ఇస్లామాబాద్ నగరాల మధ్య ఉంది. రావల్పిండి పాక్ సైనిక ప్రధాన కార్యాలయం కాగా, ఇస్లామాబాద్ రాజకీయ అధికార కేంద్రం. ఇక పీఏఎఫ్ బేస్ రఫీకి పాకిస్థాన్ ప్రధాన ఫైటర్ ఎయిర్‌బేస్‌లలో ఒకటిగా పనిచేస్తుంది. ఇక్కడ చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లు, ఫ్రెంచ్ నిర్మిత మిరాజ్ 5 ఫైటర్లు, అలౌట్ హెలికాప్టర్లు వంటి అనేక యుద్ధ విమానాలు ఉన్నాయి.

# ఐపీఎల్ నుంచి బయటకు రాలేదా.. నిర్లక్ష్యపు షాట్‌తో డకౌటైన సాయి సుదర్శన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో అద్భుతమైన ఫామ్ కారణంగా ఇంగ్లాండ్ తో జరుగుతున్న తొలి టెస్టులో సాయి సుదర్శన్ చోటు దక్కించుకున్నాడు. లీడ్స్ వేదికగా శుక్రవారం (జూన్ 20) ప్రారంభమైన తొలి టెస్ట్ లో అభిమన్యు ఈశ్వరన్ ను కాదని ఈ తమిళనాడు కుర్రాడిని జట్టులోకి తీసుకోవడం కాస్త ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఫామ్ లో ఉన్న కారణంగా సాయి సుదర్శన్ పై అందరికీ ఆడతాడనే నమ్మకాలున్నాయి. కానీ సుదర్శన్ మాత్రం తన అరంగేట్ర మ్యాచ్ లో పరుగుల ఖాతా తెరవకుండానే డకౌటయ్యాడు. సుదర్శన్ నిర్లక్ష్యపు షాట్ తో ఔట్ కావడం విమర్శలకు గురి చేస్తోంది. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ లెగ్ సైడ్ వేసిన బంతిని సాయి సుదర్శన్ ఫ్లిక్ షాట్ ఆడబోయాడు. టైమింగ్ సరిగా కుదరక షాట్ మిస్ అవ్వడంతో బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకొని వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దూరంగా వెళ్తున్న బంతిని జెమీ స్మిత్ అద్భుతంగా డైవ్ చేసి పట్టుకున్నాడు. ఐపీఎల్ లో ఇలాంటి ఫ్లిక్ షాట్స్ ఆడి పరుగులు రాబట్టిన సుదర్శన్ కు టెస్టుల్లో వర్కౌట్ కాలేదు. రిస్క్ కావడంతో సాధారణంగా టెస్టుల్లో ఫ్లిక్ షాట్స్ ఆడడానికి

బ్యాటర్లు సాహసం చేయరు. కానీ సుదర్శన్ షాట్ సెలక్షన్ విమర్శలు తీసుకొని వస్తుంది. రెండో ఇన్నింగ్స్ లో ఆడకపోతే సుదర్శన్ రెండో టెస్టుకు చోటు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే లంచ్ సమయానికి భారత్ 2 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. క్రీజ్ లో ఓపెనర్ జైశ్వాల్ (42), కెప్టెన్ శుభమాన్ గిల్ (0) ఉన్నారు. రాహుల్ 42 పరుగులు చేసి రాణించగా.. అరంగేట్ర టెస్టులో సాయి సుదర్శన్ డకౌటయ్యాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో స్టోక్స్, కార్స్ తలో వికెట్ తీసుకున్నారు.

# స్మిత్ ఔట్..19 ఏళ్ళ కుర్రాడు ఎంట్రీ: 53 టెస్టుల తర్వాత జట్టులో స్థానం కోల్పోయిన లాబుస్చాగ్నే



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు.. టెస్ట్ స్పెషలిస్ట్ మార్నస్ లాబుస్చాగ్నేకు ఆసీస్ సెలక్టర్లు షాక్ ఇచ్చారు. వెస్టిండీస్ తో జూన్ 25 నుంచి జరగబోయే టెస్ట్ సిరీస్ కు ఆస్ట్రేలియా స్క్వాడ్ నుంచి తప్పించారు. నాలుగేళ్లుగా ఆసీస్ జట్టులో రెగ్యులర్ గా ఉంటూ ఎన్నో కీలక ఇన్నింగ్స్ లు ఆడిన మార్నస్ పై ఫైనల్ గా సెలక్టర్లు కొరడా ఝులిపించారు. రెండేళ్లుగా లాబుస్చాగ్నే పేలవ ఫామ్ తో ఇబ్బంది పడుతున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్లో రెండు ఇన్నింగ్స్ (17,22) ల్లో విఫలం కావడంతో అతడిని జట్టులో కొనసాగించటానికి ఆసీస్ సెలక్టర్లు ఆసక్తి చూపించలేదు."మార్నస్ ఫామ్ లోకి రావాల్సిన అవసరం ఉంది. అతని ఫామ్ ఆశించిన స్థాయిలో లేదు. అతని నైపుణ్యానికి విలువనిస్తూనే ఉంటాము. అతను సవాలును సానుకూలంగా అధిగమించాలని ఆశిస్తున్నాం". అని చీఫ్ సెలక్టర్ బెయిలీ అన్నాడు. లాబుస్చాగ్నే ఓవర్ల గా తన టెస్ట్ కెరీర్ లో 104 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో 46.19 సగటుతో 4436 పరుగులు చేశాడు. వీటిలో 11 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2023లో మాంచెస్టర్‌లో జరిగిన యాషెస్ సిరీస్ తర్వాత అతను ఒక్క టెస్ట్ సెంచరీ కూడా చేయలేదు. చివరి నాలుగు టెస్టుల్లో అతని యావరేజ్ 25 మాత్రమే ఉంది. లాబుస్చాగ్నేతో పాటు స్టీవ్ స్మిత్ తొలి టెస్టుకు ఎంపిక కాలేదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్లో బవుమా క్యాచ్ అందుకునే క్రమంలో స్మిత్ చేతి వెలికి గాయమైంది. దీంతో స్మిత్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. రెండో టెస్టులో స్మిత్ ఆడే అవకాశం ఉంది. 51 టెస్టుల తర్వాత స్మిత్ ఒక టెస్ట్ మ్యాచ్ కు దూరం కావడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియా స్క్వాడ్ విషయానికి వస్తే స్మిత్,లాబుస్చాగ్నే స్థానాల్లో 19 ఏళ్ల సామ్ కాన్స్టాస్, జోష్ ఇంగ్లిస్‌లను సెలక్ట్ చేశారు. భారత్ తో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కాన్స్టాస్ అదరగొట్టాడు. బుమ్రా బౌలింగ్ లో ఎటాకింగ్ షాట్స్ ఆడుతూ దూకుడు చూపించాడు. మరోవైపు ఇంగ్లిస్ ఇటీవలే సూపర్ ఫామ్ లో ఉన్నాడు. బ్యాకప్ వికెట్ కీపర్ గాను జట్టులో కొనసాగుతాడు.

**ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు:**

పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), సామ్ కాన్స్టాస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లాబుస్చాగ్నే, కామెరాన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, జోష్ ఇంగ్లిస్, ట్రావిస్ హెడ్, అలెక్స్ కారీ, బ్యూ వెబ్‌స్టర్, మిచెల్ స్టార్క్, సీన్ అబాట్, స్కాట్ బోలాండ్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మాట్ కుహ్నెమాన్

# IPL గెలిచింది.. డొమెస్టిక్ క్రికెట్ ఓడింది: అభిమన్యు ఈశ్వరన్‌కు జట్టులో చోటు దక్కకపోవడంతో BCCI పై విమర్శలు




**హైదరాబాద్ పెన్ పవర్:** డొమెస్టిక్ క్రికెట్?లో పరుగుల వరద పారిస్తున్నా టాలెంటెడ్ బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్?కు మరోసారి నిరాశ ఎదురైంది. టీమిండియా తరుఫున టెస్ట్ క్రికెట్?లో అరంగ్రేటం చేసేందుకు ఎంతో కాలంగా ఎదురు చూస్తోన్న ఈ బెంగాల్ బ్యాటర్?కు మరోసారి నిరీక్షణ తప్పలేదు. ఇంగ్లాండ్?తో జరుగుతోన్న ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్?కు భారత జట్టులో అభిమన్యు ఈశ్వరన్?కు చోటు దక్కింది. కానీ శుక్రవారం (జూన్ 20) లీడ్స్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్టు ప్లేయింగ్ లెవన్?లో ఈశ్వరన్?కు స్థానం దక్కలేదు. ఈశ్వరన్ స్థానంలో ఐపీఎల్ 2025 పరుగుల వీరుడు సాయి సుదర్శన్ వైపు బీసీసీఐ మొగ్గు చూపింది. దీంతో భారత్ తరుపున టెస్ట్ అరంగ్రేటం కోసం ఏండ్లుగా ఎదురుచూస్తోన్న ఈశ్వరన్?కు మళ్లీ నిరాశే ఎదురైంది. అయితే.. ఈశ్వరన్ స్థానంలో జట్టుకు ఎంపికైన సాయి సుదర్శన్ తొలి టెస్ట్ ఫస్ట్ ఇన్సింగ్స్?లో డకౌట్ కావడంతో బీసీసీఐపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఐపీఎల్?లో రాణించిన ప్లేయర్లకే బీసీసీఐ జట్టులో అవకాశాలు ఇస్తుందని.. దేశవాళీ క్రికెట్?లో టన్నుల కొద్ది పరుగులు చేసిన బీసీసీఐ పట్టించుకోదని నెటిజన్లు విమర్శిస్తున్నారు.భిమన్యు ఈశ్వరన్ కు జట్టులో చోటు దక్కకపోవడంతో 'మరోసారి ఐపీఎల్ గెలిచింది.. దేశవాళీ క్రికెట్ ఓడిపోయింది" అని ఓ నెటిజన్ బీసీసీఐ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. సాయి సుదర్శన్ మంచి ఆటగాడే కానీ ఎంతో కాలంగా జట్టులో స్థానం కోసం ఎదురుచూస్తోన్న అభిమన్యు ఈశ్వరన్ కు ఒక్కసారి అవకాశం ఇవాల్సిందని మరికొందరు కామెంట్ చేస్తున్నారు.కాగా, 29 ఏళ్ల ఈశ్వరన్ 2022లో బంగ్లాదేశ్ పర్యటనలో తొలిసారిగా భారత జట్టుకు ఎంపిక అయ్యాడు. కానీ అతడికకి ఒక్క మ్యాచులో కూడా ఆడే అవకాశం దక్కలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి కూడా టీమిండియాకు ఎంపిక అయ్యాడు. కానీ ఇక్కడ కూడా సేమ్ అదే సీన్. ఒక్క మ్యాచులో కూడా ప్లేయింగ్ లెవన్?లో చోటు దక్కలేదు. ఇప్పుడు ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు కూడా సెలెక్ట్ అయ్యాడు. తొలి టెస్ట్ లో ఆడే ఛాన్స్ రాలేదు. మరీ మిగిలిన నాలుగు మ్యాచుల్లోనైనా ఈశ్వరన్?కు చోటు దక్కుతుందో లేదో చూడాలి.




ఆకాంక్ష శర్మ గ్లామర్ మరియు గ్రేస్ ప్రసరిస్తుంది

# ప్రియాంక చోప్రాతో మహేష్ రొమాన్స్!



గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా- సూపర్ స్టార్ మహేష్ రొమాన్స్ కి ఛాన్స్ ఉందా? ఆ ఛాన్స్ రాజమౌళి తీసు కునే తీసుకుంటున్నాడా? అంటే అవుననే చిన్న లీక్ అందుతుంది. సాధారణంగా రాజమౌళి సినిమాల్లో రొమాన్స్ కనిపించదు. ఉన్నా? ఉన్నాదా? లేదా? అన్నట్లే ఉంటుంది. అంటే బాహుబలిలో ప్రభాస్-తమన్నా మధ్య చెరువు గట్టున సాగిన రొమాన్స్ లా. జక్కన్న సినిమాల్లో అశ్లీల సన్నివేశాలకు ఛాన్స్ ఇవ్వరు. ఆయన ఫోకస్ అంతా పాత్రలు..కథపైనే పెట్టి పనిచేస్తాడు. అవసరమైతే అర గంట సినిమా నిడివి పెంచు తానంటాడు తప్ప! బోల్డ్ సన్నివేశాలు తనవల్ల కాదంటాడు. బాహుబలి, ఆర్ ఆర్ ఆర్ ద్వారా ఆ విషయం అర్ధమైంది. అంతకు ముందు తీసిన సినిమాల్లో కూడా ఎలాంటి రొమాన్స్ ఉండదు. కానీ ఎస్ ఎస్ ఎంబీ 29 లో మాత్రం హీరో-హీరోయిన్ మధ్య రొమాన్స్ డిమాండ్ చేస్తోందిట. ఆఫ్రికన్ బ్యాక్ డ్రాప్ లో సాగే స్టోరీ కావడం.. కథ చాలా వరకూ అడవిలో సాగుతుంది. పైగా అడ్వెంచర్ థ్రిల్లర్ . సోలోగా సాగే కౌబోయ్ ప్రయాణంలో మెరుపులా తారసపడిన ప్రియాంక మధ్య పరిచయ సన్నివే శాల్లోనే కొంత రొమాన్స్ రాసినట్లు లీకులందుతున్నాయి. కథ తయారీలో రాజేంద్ర ప్రసాద్ ఇలా ఉండా లని డిజైన్ చేసారుట. పెద్దాయన అంత క్లారిటీ రాసారంటే? రాజమౌళి కూడా నో ఛాన్స్ అనే అవకాశం ఉండదు. కన్విన్స్ అయి తీసే అవకాశం ఉంటుంది. సీన్స్ విషయంలో రాజమౌళి రాజీ పడరు. కానీ రొమాంటిక్ సన్నివేశాలంటే కాస్త తెగించి తీయాల్సి ఉంటుంది. ఈ సినిమా ద్వారా కొన్ని రూల్స్ ను రాజమౌళి బ్రేక్ చేయక తప్పేలా లేదు. ఇప్పటికే రెండు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం థర్డ్ షెడ్యూల్ జరుగుతుంది. తదుపరి కెన్యా పయనం ఉంటుంది.



త్రిప్తీ డిమ్రీ: బాలీవుడ్‌ను ఆక్రమిస్తున్న కొత్త యుగం ఫ్యాషన్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com